



# పెన్ పవర్



తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 11 సంచిక : 281 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 17 జూన్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 281 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 17 JUNE 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur









# వరల్డ్ రికార్డుకు రెడీ

## విశాఖలో యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన సీఎం చంద్రబాబు

- అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలనకు విశాఖ వెళ్లిన సీఎం చంద్రబాబు
- జూన్ 21న విశాఖ ఆర్కే బీచ్‌లో యోగా డే, హాజరుకానున్న ప్రధాని మోదీ
- సుమారు ఐదు లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం ఆదేశం
- ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి
- కార్యక్రమానికి ముందు మాక్ యోగా నిర్వహించాలని అధికారులకు సూచన

### విశాఖలో యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన సీఎం చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు విశాఖపట్నంలో పర్యటించారు. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ

వివరాలు 2లో..



- విశాఖలో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం
- యోగాంధ్ర కార్యక్రమంపై చంద్రబాబు సమీక్ష
- ప్రపంచ రికార్డు లక్ష్యంగా భారీ యోగా కార్యక్రమం
- అధికారులకు చంద్రబాబు దిశానిర్దేశం

పెన్ పవర్ డెస్క్: యోగాను ప్రతి ఒక్కరి జీవితంలో అంతర్భాగం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇందుకోసం ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాల్లో నిరంతర యోగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో ఈ నెల 21న నిర్వహించనున్న 'యోగాంధ్ర' అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సోమవారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమీక్షకు ముందు, ముఖ్యమంత్రి చంద్రబాబు యోగా కార్యక్రమ ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఆర్కే బీచ్‌ను సందర్శించి, జిల్లా అధికారులతో మాట్లాడి పలు కీలక సూచనలు చేశారు. వీఐపీల భద్రత, ఇతర ముఖ్యమైన అంశాలపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇక సమీక్ష సమావేశంలో, యోగా దినోత్సవ ఏర్పాట్లకు సంబంధించి స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ముఖ్యమంత్రికి వివరాలు అందించారు. భద్రతాపరమైన అంశాలపై డీజీపీ హరీశ్‌గుప్తా వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ, "పదేళ్ల తర్వాత అతిపెద్ద యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించేలా ఏర్పాట్లు పర్యవేక్షించాలి" అని తెలిపారు. పర్యవేక్షణ బాధ్యతలను సెక్రటేరియట్ యూనిట్ సిబ్బందికి అప్పగించాలని, క్షేత్రస్థాయిలో ఇతర సిబ్బందిని నియమిస్తే జవాబుదారీతనం ఉండదని సీఎం అభిప్రాయపడ్డారు. సెక్రటేరియట్ సిబ్బంది, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. "యోగా నిర్వహణలో మనం ఒక కొత్త రికార్డు సృష్టించబోతున్నాం. దాదాపు 3.4 లక్షల మంది ఒకే ప్రాంతంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం"

వివరాలు 2లో..

# జనాలను పెట్టి కోడిగుడ్లు, టమాటాలు వేయించాలనుకోవడం దారుణం

- జగన్ పర్యటనలను అడ్డుకోవాలనుకుంటున్నారని అంబటి మండిపాటు
- జగన్ బందోబస్తు బాధ్యత పోలీసులదేనని వ్యాఖ్య
- చంద్రబాబు రాజకీయాలను చిన్నప్పటి నుంచి చూస్తున్నామని ఎద్దేవా



పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు బెదిరింపు రాజకీయాలకు భయపడేది లేదని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. వైసీపీ అధినేత జగన్ పర్యటనలను అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. పోలీసుల వేధింపులను తట్టుకోలేక వైసీపీ నేత నాగమల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్నారని... ఆయన కుటుంబసభ్యులను పరామర్శించేందుకు జగన్ వెళుతుంటే... ప్రభుత్వం పిచ్చి చేష్టలకు దిగుతోందని విమర్శించారు. జగన్ అసలు బయటకే రావద్దన్నట్టుగా పోలీసుల వైఖరి ఉందని అన్నారు.
జగన్ బందోబస్తు ఏర్పాటు బాధ్యత పోలీసులదేనని.... జగన్ పర్యటించొద్దని అనడం కరెక్ట్ కాదని అంబటి చెప్పారు. జగన్ పర్యటనల సందర్భంగా హింస సృష్టించేందుకు చంద్రబాబు, లోకేశ్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. జనాలను పెట్టి కోడిగుడ్లు, టమాటాలు వేయించాలనుకోవడం దారుణమని అన్నారు. చంద్రబాబు రాజకీయాలను చిన్నప్పటి నుంచి చూస్తున్నామని... ఆయన రాజకీయాలకు తాము భయపడే ప్రసక్తే లేదని చెప్పారు.

# ప్రధాని నరేంద్ర మోదీకి సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారం


- భారతీయులందరికీ దక్కిన గౌరవమన్న ప్రధానమంత్రి
- ఇరుదేశాల మైత్రికి ఈ పురస్కారం అంకితమని వ్యాఖ్య
- భారత్-సైప్రస్ బంధం మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం
- రెండు దశాబ్దాల తర్వాత సైప్రస్‌లో భారత ప్రధాని పర్యటన



పెన్ పవర్ డెస్క్:భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తుతం సైప్రస్ దేశంలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా, సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్

వివరాలు 2లో..

# అమెరికాలో కాల్పుల కలకలం.... ముగ్గురి మృతి



- అమెరికాలో మరోసారి కాల్పుల ఘటనతో ఉద్రిక్తత
- ఉటా రాష్ట్రంలోని సెంటెనియల్ పార్క్‌లో దారుణం
- వెస్ట్‌ఫెస్ట్ కార్నివాల్‌లో ఆదివారం రాత్రి ఈ ఘటన
- ఎనిమిది నెలల చిన్నారితో పాటు ముగ్గురు మృతి చెందినట్లు నిర్ధారణ
- ఇద్దరికి గాయాలు, ఆసుపత్రిలో చికిత్స
- ఘటనపై వెస్ట్ వ్యాలీ సిటీ పోలీసులు దర్యాప్తు

వివరాలు 2లో..

# చంద్రబాబు గారూ జూనియర్ ఎన్టీఆర్ ఇక రాడు కదా... లోకేశ్ కు బాధ్యతలు అప్పగించండి

- చంద్రబాబు, లోకేశ్ ఎంఐఎం అధినేత అసద్ తీవ్ర వ్యాఖ్యలు
- టీడీపీలో జూనియర్ ఎన్టీఆర్ అంశాన్ని లేవనెత్తిన ఒవైసీ
- నారా లోకేష్ నాయకత్వ పటిమపై అసదుద్దీన్ సందేహాలు
- బీజేపీతో చంద్రబాబు పొత్తును విమర్శించిన ఎంఐఎం చీఫ్
- ఏపీ రాజకీయాల్లో ఒవైసీ కామెంట్స్‌తో కొత్త చర్చ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయాల నుంచి విరమించుకుని, ఆయన కుమారుడు, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ కు బాధ్యతలు అప్పగించాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సంచలన సూచన చేశారు. ఆదివారం రాత్రి కర్నూలు జిల్లా

వివరాలు 2లో..

# ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ కు రూ.10 లక్షల విరాళం ప్రకటించిన మంత్రి నాదెండ్ల

- కొలకలూరులో సెర్ప్ ఆధ్వర్యంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటు
- కోటి రూపాయల విలువైన భూమిని విరాళంగా ఇచ్చిన పొన్నెకంటి కుటుంబం
- ప్రభుత్వంపై ప్రజలకు పెరుగుతున్న నమ్మకానికి ఇది నిదర్శనమన్న మంత్రి మనోహర్



పెన్ పవర్ డెస్క్:తెనాలి మండలం కొలకలూరు గ్రామ పంచాయతీలో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (సెర్ప్-ఎంఎస్ఎంఈ) అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తన కుటుంబం తరపున 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా, ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి, వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు.

వివరాలు 2లో..

# చంద్రబాబు తరచూ వాడే హెలికాప్టర్ లో సాంకేతికలోపం... పర్యటన రద్దు చేసుకున్న కేంద్ర మంత్రి

- కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఏపీ పర్యటనలో అవాంతరం
- తిరుపతి నుంచి కృష్ణపట్నం వెళ్లే హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య
- సీఎం చంద్రబాబు కూడా ఇదే హెలికాప్టర్ వినియోగం



పెన్ పవర్ డెస్క్: కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆంధ్రప్రదేశ్ పర్యటనలో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకుంది. ఆయన ప్రయాణించాల్సిన హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో కృష్ణపట్నం పర్యటన రద్దు అయింది.

వివరాలు 2లో..

# మంత్రి నారా లోకేశ్ చొరవతోనే ఇది సాధ్యమైంది

## గుంటూరు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



- సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ మారుపేరన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్
- 'తల్లికి వందనం' పథకంతో ప్రతి ఇంట్లో సంతోషాలు వెల్లివిరిశాయి
- ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం
- ఏడాదిలోనే రూ.10,091 కోట్లు విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ
- జగన్ రెడ్డి పాలనలో సంక్షేమం పేరుతో సంక్షోభమే మిగిలిందన్న ఎమ్మెల్యే

వివరాలు 2లో..

# ఎడిటర్ వ్యూ

## మళ్లీ అదే టీం

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మరొకసారి ఐప్యాక్ పై ఆధారపడుతున్నారా? అంటే అవుననే అనిపిస్తుంది. ఈసారి కూడా ఐ ప్యాక్ టీంతో నే ఎన్నికలకు వెళ్లాలని ఆయన నిర్ణయించినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకుని తనకు అప్పగించడమే కాకుండా ఎప్పటికప్పుడు నివేదికలను అందించడానికి ఐ ప్యాక్ టీం ను తిరిగి యాక్టివ్ చేయాలని వైఎస్ జగన్ నిర్ణయించారు. ఈ మేరకు గత ఎన్నికల్లో పనిచేసిన వారిని ఈసారి కూడా వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. మరోసారి సర్వేలకు రెడీ అవ్వాలని ఐ ప్యాక్ టీంను ఆదేశించినట్లు తెలిసింది. మొన్నటి ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత ఐప్యాక్ కార్యాలయాన్ని కూడా తీసి వేశారు.

**నివేదికలు అందాలంటే...**

అయితే తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. జనంలో మంచి ఊపు ఉందని, అయితే ఫీల్డ్ లెవెల్ లో తనకు ఖచ్చితమైన సమాచారం తెలియాలంటే ఐ ప్యాక్ టీం అవసరాన్ని గుర్తించిన జగన్ మరోసారి దానిని రంగంలోకి దించాలని నిర్ణయించారని తెలిసింది. త్వరలోనే ఐ ప్యాక్ టీం తిరిగి ఆంధ్రప్రదేశ్ లో కార్యక్రమాలను ప్రారంభిస్తుందని కూడా పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు 2019లో అధికారాన్ని తెచ్చిపెట్టిన ఐ ప్యాక్ సంస్థ మొన్నటి ఎన్నికల్లో ఓటమి తర్వాత దుకాణం మూసివేసింది. ఈ సంస్థ బీహార్ కు చెందిన ప్రశాంత్ కిషోర్ దే అయినప్పటికీ ఆయన 2019 ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన బీహార్ రాజకీయాలకు పరిమితమయ్యారు. దీంతో ఐప్యాక్ సంస్థలో పనిచేసిన వారు దానిని నిర్వహిస్తున్నారు. 2024 ఎన్నికలకు కూడా వైఎస్ జగన్ మరోసారి గెలిచేందుకు ఐప్యాక్ సంస్థను కొనసాగించారు. ఐప్యాక్ సంస్థకు రుషిరాజ్ నేతృత్వం వహించారు.

**మళ్లీ రుషిరాజ్ నేతృత్వంలోనే?**

తిరిగి రుషిరాజ్ నేతృత్వంలోనే ఐ ప్యాక్ సంస్థ పనిచేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిసింది. జనాభా గణన మొదలు కానుండటంతో పాటు 2027లో ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారంతో జమిలి ఎన్నికల నేపథ్యంలో ఐ ప్యాక్ ను త్వరగానే రంగంలోకి దించాలని వైఎస్ జగన్ భావిస్తున్నార. ఎప్పటి లాగానే ఐ ప్యాక్ సంస్థ అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం వరకూ, సోషల్ మీడియాలో ప్రచారం వరకూ అంతా తానే చేసుకునేలా ఒప్పందం కుదుర్చుకునే అవకాశాలున్నాయని పార్టీ సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఒక్కోసారి వైఫల్యాలు ఉంటాయని, అది జనం మనసులను అంచనా వేయడంలో తప్పు అయినా, దాని అవసరం తమకు ఉందని గుర్తించిన జగన్ తిరిగి ఐ ప్యాక్ ను రెడీ చేస్తున్నట్లు తెలిసింది.

**ఏడాది కావడంతో...**

ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వం మారి ఏడాది పూర్తి కావస్తుండటంతో ప్రస్తుతం సోషల్ మీడియా తనకు ప్రధానం కావడంతో ఇటు వైసీపీ సోషల్ మీడియాకు తోడు ఐ ప్యాక్ సంస్థ కూడా ఉంటే ఇంకొంత ప్రయోజనం ఉంటుందని జగన్ భావించి వారితో చర్చలు జరిపినట్లు తెలిసింది. త్వరలోనే అంటే రెండు మూడు నెలల్లో ఐ ప్యాక్ సంస్థ తిరిగి వైసీపీ కోసం తిరిగి ఆంధ్రప్రదేశ్ లో పనిచేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. జగన్ కూడా ఇక జిల్లాలను పర్యటిస్తుండటంతో పాటు పాదయాత్ర చేయాలన్న ఆలోచన కూడా ఉండటంతో ఐ ప్యాక్ ను రంగంలోకి దించితే మరింతగా జనానికి చేరువయ్యేందుకు ఉపయోగపడుతుందని జగన్ భావించి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# అమెరికాలో కాల్పుల కలకలం.... ముగ్గురి మృతి

అగ్రరాజ్యం అమెరికాలో మరోమారు నెత్తురోడిం ది. ఉన్మాదుల తుపాకుల తూటాలకు అమాయకుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా యి. తాజాగా, ఉటా రాష్ట్రంలో జరిగిన ఓ పండుగలో చెలరేగిన కాల్పుల బీభత్సం, పసికందుతో సహా ముగ్గురిని బలిగొంది. ఈ దారుణ ఘటనతో యావత్ అమెరికా ఉలిక్కిపడింది, తుపాకీ సంస్కృతిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

వివరాల్లోకి వెళితే, ఉటా రాష్ట్రంలోని వెస్ట్ వ్యాలీ సిటీలో గల సెంటెనియల్ పార్క్‌లో ఆదివారం రాత్రి 'వెస్ట్‌ఫెస్ట్' పేరిట జరుగుతున్న వార్షిక కార్నివాల్ ఆనందోత్సాహాల మధ్య ఈ విషాదం చోటుచేసుకుంది. కార్నివాల్ రైడ్‌ల సమీపంలో ఈ ఘాతుకం జరిగినట్లు తెలుస్తోంది. వెస్ట్ వ్యాలీ సిటీ పోలీసులు ఈ ఘటనను ధృవీకరిస్తూ, తమ అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ప్రాథమిక సమాచారాన్ని వెల్లడించారు. "సెంటెనియల్ పార్క్‌లో జరుగుతున్న వెస్ట్‌ఫెస్ట్‌లో కాల్పులు జరిగాయి. పలువురు బాధితులు ఉన్నారు" అని పోలీసులు తమ పోస్టులో పేర్కొన్నారు.

ఈ అమానుష కాల్పుల్లో 8 నెలల పసికందు ఎజ్రా పంతలియోన్, 20 ఏళ్ల పాల్ తాహి, 21 ఏళ్ల ఏంజెలికా చావెజ్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరొకరికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అత్యవసర సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకుని, క్షతగాత్రులను హుటాహుటిన సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.వెస్ట్ వ్యాలీ సిటీ పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తును ముమ్మరం చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, రెండు వర్గాల మధ్య తలెత్తిన ఘర్షణ కాల్పులకు దారి తీసి ఉండవచ్చని, ఇది ప్రతీకార చర్యగా జరిగిన గ్యాంగ్ సంబంధిత దాడిగా పోలీసులు అనుమానిస్తున్నారు. "ఇది యాదృచ్ఛికంగా జరిగిన దాడి కాదు,

నిర్దిష్ట వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు" అని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు.

అగ్రరాజ్యంలో నిత్యకృత్యంగా మారిన తుపాకీ హింసకు ఈ ఘటన మరో చేదు నిదర్శనం. ఇటీవలి కాలంలో ఫిలడెల్ఫియా, బాల్టిమోర్ నగరాల్లో జరిగిన సామూహిక కాల్పుల ఘటనలు మరవకముందే ఉటాలో ఈ దారుణం చోటుచేసుకోవడం గమనార్హం. పౌరుల భద్రత, తుపాకుల నియంత్రణపై అమెరికాలో మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# వరల్డ్ రికార్డుకు రెడీ

- మొదటి పేజీ తరువాయి

అని చంద్రబాబు వెల్లడించారు.

"ఉదయం నుంచి నేను ఒకసారి కార్యక్రమ స్థలానికి వెళ్లి అన్ని ఏర్పాట్లను పరిశీలించాను. వర్షం వస్తుందనే అంచనాలతో, అనుకోని పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకుని అన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నాం" అని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు మూడు లక్షల మందికి పైగా ప్రజలు పాల్గొంటారని అంచనా వేస్తున్నామని, ఎంతమంది వచ్చినా వారికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. గత నెల రోజులుగా లేదా కొద్ది రోజులుగా ఈ కార్యక్రమం కోసం సాధన చేసిన వారందరూ ఇందులో పాలుపంచుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు.పాల్గొనేవారి సౌకర్యార్థం విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు సీఎం వివరించారు. "మొత్తం 34 బారికేడ్లను ఏర్పాటు చేశాం. ప్రతి బారికేడ్‌లో వెయ్యి మంది ఉండేలా స్పష్టమైన మ్యాపింగ్ తయారుచేశాం. వారికి సహాయంగా వాలంటీర్లను, కోచ్‌లను నియమించాం. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు వైద్యులను కూడా అందుబాటులో ఉంచాం" అని చంద్రబాబు తెలిపారు. పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి వంద మందికి ఒక టాయిలెట్ చొప్పున ఏర్పాటు చేశామని, గతంలో వెయ్యి మందికి ఒకటిగా పొరపాటున చెప్పిన దానిని సవరించుకుంటున్నట్లు స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఈవెంట్‌లో పాల్గొనేందుకు వచ్చేవారికి వాహన సౌకర్యాలు, వారు ఎప్పుడు బయలుదేరాలి, ఎప్పుడు కార్యక్రమ స్థలానికి చేరుకోవాలనే విషయాలపై కూడా ముందుగానే స్పష్టత ఇచ్చామని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా 22 అంశాలలో గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లేదా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నామని, దాదాపు 22 రికార్డులు వచ్చే అవకాశం ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "ఈ రికార్డులను కూడా నమోదు చేయడం కోసం ముందుకు పోతున్నాం" అని చంద్రబాబు వివరించారు. మొత్తం మీద, కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన పునరుద్ఘాటించారు.

## చంద్రబాబు గారూ జూనియర్ ఎన్టీఆర్ ఇక రాడు కదా... లోకేశ్ కు బాధ్యతలు అప్పగించండి

- మొదటి పేజీ తరువాయి

ఆదోనిలో జరిగిన ఒక బహిరంగ సభలో ఒవైసీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆదోనిలో జరిగిన సభలో ప్రసంగించిన అసదుద్దీన్ ఒవైసీ, ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. "చంద్రబాబు నాయుడు గారూ, మీకు చెబుతున్నా, మీరు లోకేశ్ భవిష్యత్తును (రాజకీయంగా) నాశనం చేస్తున్నారు. మీ తర్వాత ఎలాగైనా మీ కొడుకే కదా (వారసుడిగా) బాధ్యతలు స్వీకరిస్తాడు... జూనియర్ ఎన్టీఆర్ రాడు కదా? మీరు లోకేశ్ ను గందరగోళంలో పడేస్తున్నారు" అని ఒవైసీ అన్నారు.చంద్రబాబు సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేశారని గుర్తుచేస్తూ, "మీరు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 9 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేశారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు 5 సంవత్సరాలు పనిచేశారు. అది చాలు. ఇప్పుడు మీ కుమారుడి విషయం చూసుకోండి (బాధ్యతలు అప్పగించండి)" అని ఒవైసీ వ్యాఖ్యానించారు.

## ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ కు రూ.10 లక్షల విరాళం ప్రకటించిన మంత్రి నాదెండ్ల

- మొదటి పేజీ తరువాయి

సోమవారం నాడు తెనాలిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఈ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటుకు సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. కొలకలూరు గ్రామానికి చెందిన పొన్నెకంటి సువర్చల శశికిరణ్ కుటుంబ సభ్యులు తమ పొన్నెకంటి పోతురాజు ట్రస్ట్ పేరు మీద సుమారు కోటి రూపాయలు విలువ చేసే ఎకరం భూమిని ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వానికి విరాళంగా అందజేశారు. ఈ భూమిని సెర్ప్ అధికారులకు మంత్రి మనోహర్ సమక్షంలో అప్పగించారు. ఈ సందర్భంగా దాతల సేవా నిరతిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మంత్రి మనోహర్ మాట్లాడుతూ, కొలకలూరు గ్రామాభివృద్ధికి తమ కుటుంబం తరపున ఈ చిన్న చేయూత (రూ.10 లక్షలు) అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెరుగుతోందనడానికి ఇటువంటి భూదానాలు, విరాళాలే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ద్వారా కేవలం ఉపాధి మాత్రమే కాకుండా, అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా అందించి, తయారైన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించి ఎగుమతులను ప్రోత్సహిస్తామని మంత్రి వివరించారు. కొలకలూరును రాష్ట్రంలోనే ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ శ్రీమతి సంజనా సింహ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేశ్ చొరవతోనే ఇది సాధ్యమైంది

తెలుగుదేశం పార్టీ సంక్షేమానికి మారుపేరుగా నిలుస్తోందని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొందని తెలిపారు. పాఠశాలలు తెరిచిన తొలిరోజే 4.81 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.718.95 కోట్లు జమ చేశామని, విద్యార్థులకు స్కూల్ కిట్లు, బ్యాగులు అందించామని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో ఇది సాధ్యమైందని, ఇది ఒక రికార్డు అని కొనియాడారు.గత వైసీపీ ప్రభుత్వం పిల్లలను చదివించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే, ఈ పథకం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యార్థులందరినీ చదివించాలని ప్రోత్సహిస్తున్నారని నసీర్ అహ్మద్ వివరించారు. 'తల్లికి వందనం' పథకాన్ని వైసీపీకి మరణశాసనంగా ఆయన అభివర్ణించారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో 'అమ్మఒడి' కింద రూ.24 వేల కోట్లు ఖర్చు చేస్తే, తమ కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే 'తల్లికి వందనం' కోసం రూ.10,091 కోట్లు కేటాయించిందని వివరించారు.

ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.13,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని, కొందరు ఐదుగురు పిల్లలున్న తల్లులకు రూ.65,000, ఒక కుటుంబంలో 12 మంది పిల్లలకు రూ.1,56,000 కూడా జమ చేశామని నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఒక్కరికే పరిమితం చేసి మోసం చేసిందని ఆరోపించారు. పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా చంద్రబాబు 'పీ4' విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. ' గతంలో కేవలం 42 లక్షల మందికే 'అమ్మఒడి'అందిందని, తల్లికి వందనం' ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. మైనార్టీలకు కూడా కూటమి ప్రభుత్వంలో 54 శాతం అధికంగా ప్రయోజనం కలిగిందని తెలిపారు. జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రం విధ్వంసం నుంచి నేడు అభివృద్ధి వైపు పయనిస్తోందని, సూపర్ సిక్స్ హామీల అమలుతో వైసీపీ నేతల్లో వణుకు మొదలైందని నసీర్ అహ్మద్ వ్యాఖ్యానించారు.

## ప్రధాని నరేంద్ర మోదీకి సైప్రస్ అత్యున్నత పౌర పురస్కారం

- మొదటి పేజీ తరువాయి

ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్ 3'ను ప్రధాని మోదీ అందుకున్నారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును ప్రధాని మోదీకి అందజేశారు. ఈ గౌరవం 140 కోట్ల మంది భారతీయులకు దక్కిందని, ఇది ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన సాంస్కృతిక సంబంధాలకు, సోదరభావానికి, వసుధైక కుటుంబం అనే భావనకు నిదర్శనమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.ఈ పురస్కారాన్ని అందుకున్న అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ, సైప్రస్ ప్రభుత్వానికి, అక్కడి ప్రజలకు తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డును భారత్-సైప్రస్ దేశాల మధ్య ఉన్న చిరకాల స్నేహానికి అంకితం చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ గుర్తింపు ఇరు దేశాల శాంతి, భద్రతలు, సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రత, శ్రేయస్సు వంటి అంశాలపై పరస్పర నిబద్ధతను మరింతగా పటిష్టం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

భవిష్యత్తులో భారత్-సైప్రస్ మధ్య క్రియాశీల భాగస్వామ్యం సరికొత్త శిఖరాలకు చేరుకుంటుందని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. రెండు దేశాలు తమ పురోగతిని బలోపేతం చేసుకోవడమే కాకుండా, ప్రపంచంలో సురక్షితమైన, శాంతియుత వాతావరణాన్ని నిర్మించడానికి కూడా తమ వంతు సహకారం అందిస్తాయని ఆయన తెలిపారు.ఆదివారం సాయంత్రం ప్రధాని మోదీ మూడు దేశాల పర్యటనలో భాగంగా సైప్రస్ చేరుకున్నారు. లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయనకు సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ సాదరంగా స్వాగతం పలికారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని సైప్రస్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటన భారత్, సైప్రస్ సంబంధాలలో ముఖ్యమైన ప్రగతికి దోహదం చేస్తుందని, ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడుల రంగాలలో కలిసి పనిచేసే అవకాశాలు మరింతగా పెరుగుతాయని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. సైప్రస్ పర్యటన ముగించుకున్న అనంతరం, ప్రధాని మోదీ కెనడాకు వెళతారు. అక్కడ జీ7 సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఆ తర్వాత క్రొయేషియాకు వెళ్లనున్నారు.

## చంద్రబాబు తరచూ వాడే హెలికాప్టర్ లో సాంకేతికలోపం...

- మొదటి పేజీ తరువాయి

ఈ హెలికాప్టర్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తన జిల్లా పర్యటనల కోసం తరచుగా వినియోగిస్తుండటం గమనార్హం. ఈ ఘటన నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఇతర వీవీఐపీలు ఉపయోగించే హెలికాప్టర్ల భద్రత, సాంకేతిక అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని డీజీపీ సంబంధిత అధికారులను ఆదేశించారు.వివరాల్లోకి వెళితే, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తిరుచానూరులో శ్రీ పద్మావతి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, ఆయన తిరుపతి నుంచి కృష్ణపట్నం పోర్టు సందర్శనకు వెళ్లాల్సి ఉంది. ఇందుకోసం అధికారులు ప్రత్యేక హెలికాప్టర్‌ను ఏర్పాటు చేశారు. అయితే, తిరుపతిలో హెలికాప్టర్ ఎక్కిన తర్వాత సాంకేతిక సమస్య ఉన్నట్లు సిబ్బంది గుర్తించారు.

ఈ విషయాన్ని కేంద్రమంత్రి భద్రతా సిబ్బందికి తెలియజేశారు. ప్రయాణానికి సురక్షితం కాదని భావించడంతో, పీయూష్ గోయల్ తన కృష్ణపట్నం పర్యటనను రద్దు చేసుకున్నారు. అనంతరం ఆయన ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తిరిగి వెళ్లారు.

## విశాఖలో యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో చేపట్టనున్న 'యోగాంధ్ర' కార్యక్రమం ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొననుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. విశాఖ ఆర్కే బీచ్ వేదికగా జరగనున్న ఈ యోగా దినోత్సవ కార్యక్రమానికి సుమారు ఐదు లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్కే బీచ్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను ముఖ్యమంత్రి చంద్రబాబు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. యోగాంధ్ర 2025 నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబు... యోగా దినోత్సవం కోసం చేసిన ఏర్పాట్లను ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే, బీచ్ రోడ్డు వెంబడి వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని విశాఖ జిల్లా కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 607 సచివాలయాల సిబ్బంది హాజరవుతున్నారని, వారిని సమన్వయం చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనే వారితో ముందుగా మాక్ యోగా నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమం జరిగే రోజు ఉదయం 6:30 గంటల నుంచి 8:00 గంటల వరకు ఈ మాక్ యోగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

ప్రధానమంత్రితో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందున భద్రతాపరంగా తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, సామాన్య ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు వచ్చేవారి వాహనాల పార్కింగ్ కోసం చేసిన ఏర్పాట్ల గురించి కూడా సీఎం ఆరా తీశారు. ఆర్కే బీచ్‌లోని ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ముఖ్యమంత్రి ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్‌కు వెళ్లి అక్కడ కూడా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## విమాన ప్రమాదంలో మృతి చెందిన విజయ్ రూపానీకి నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే. ఆయన మృతదేహాన్ని డీఎన్ఏ పరీక్షల ద్వారా అధికారులు గుర్తించారు. లండన్‌లో ఉంటున్న తన భార్య, కుమార్తెను కలిసేందుకు వెళ్తుండగా విజయ్ రూపానీ ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. అంతకుముందు రెండుసార్లు... మే 19న, జూన్ 5న ఆయన లండన్ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. మూడో ప్రయత్నంగా జూన్ 12న బయలుదేరిన ఆయనకు అదే చివరి ప్రయాణమైంది. జూన్ 25న తిరిగి రావాలని ఆయన ప్రణాళిక చేసుకున్నారు. విమానం ఎక్కే ముందు ఎయిర్‌పోర్ట్‌లో రూపానీ ఎంతో ఉత్సాహంగా కనిపించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇద్దరు బ్రిటిష్ జాతీయులు తీసిన వీడియోలో ఈ దృశ్యాలు రికార్డయ్యాయి.జూన్ 12వ తేదీన ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ విమానం అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలింది. ఈ విమానం సమీపంలోని ఓ మెడికో హాస్టల్‌పై పడటంతో పెను విషాదం చోటుచేసుకుంది. విమానంలో సుదూర ప్రయాణానికి సరిపడా సుమారు 1,25,000 లీటర్ల ఇంధనం ఉండటంతో, కూలిన వెంటనే భారీగా మంటలు చెలరేగాయి.

ప్రమాద సమయంలో విమానంలో 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది సహా మొత్తం 242 మంది ఉన్నారు. వీరిలో ఒకే ఒక ప్రయాణికుడు స్వల్ప గాయాలతో అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడగా, విజయ్ రూపానీతో సహా 241 మంది దుర్మరణం పాలయ్యారు. కాగా, విమానం కూలిన ప్రదేశంలోని మెడికో హాస్టల్‌లో కూడా భారీ ప్రాణనష్టం సంభవించింది.

## ఆరోగ్యం కోసం యోగాను అలవరచుకోవాలి : జిల్లా జైల్ సూపరింటెండెంట్ రహమాన్



**అనంతపురం, పెన్ పవర్ జూన్ 16 :** అనంతపురం జిల్లా జైల్ ప్రాంగణం, రెడ్డిపల్లిలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జైల్ సూపరింటెం డెంట్ రహమాన్ మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని యోగా కార్యక్రమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టడం జరిగిందని, జిల్లా జైల్ లో ఉన్నవారు అందరూ కూడా తమ ఆరోగ్యం కోసం యోగా చేసుకొని శారీరక, మానసిక ఆరోగ్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో డియంహెచ్ఓ, యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి డా.ఈబి.దేవి, జైల్ అధికారులు వసంతకుమార్, నాగరాజ్, హరీష్, చంద్రమోహన్, రవికుమార్, ఆయుష్ అధికారులు డా.రామ్ కుమార్, డా.లాల్యా నాయక్, డెమో త్యాగరాజ్, డిప్యూటీ హెచ్ఈఓ గంగాధర్, వివేకానంద యోగ కేంద్రము యోగా గురువు రాజశేఖర్ రెడ్డి, ఈస్పా ఫౌండేషన్ ఆదిత్య, వారి సిబ్బంది, పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా డియంహెచ్ఓ మాట్లాడుతు జైల్ అధికారులు, సిబ్బంది, ఖైదీలు అందరూ యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం సంతోషకరమన్నారు. అందరూ యోగాను సాధన చేయాలని, యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల దేశ ప్రధాని నరేంద్ర మోడీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, జిల్లాలో యోగా కార్యక్రమం విజయవంతంగా జరగడానికి మార్గదర్శనం చేస్తున్న జిల్లా కలెక్టర్ డా.వినోద్ కుమార్‌కి, జైల్‌లో జరగడానికి సహకరించిన సూపరింటెండెంట్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# పెన్ పవర్
## వై.ఎస్.ఆర్. కడప
## అన్నమయ్య జిల్లా

## ర్యాలీలు ,ధర్నాలు, నిరసనలకు, పోలీస్ అధికారుల అనుమతి తప్పనిసరి : డిఎస్పీ



**కడప, పెన్ పవర్ జూన్ 16 :** కడప నగరంలో ధర్నాలు, ర్యాలీలు లేదా నిరసన కార్యక్రమాలు నిర్వహించుటకు పోలీసు వారి ముందస్తు పర్మిషన్ తప్పనిసరి డిఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులకు, కమ్యూనిస్టు పార్టీ నాయకులకు మరియు వివిధ సంఘాల నాయకులకు కడప పోలీసు వారు తెలియజేయు ముఖ్య విషయం ఏమనగా, కడప నగరంలో వివిధ సమస్యల దృష్ట్యా మీరు ఏవైనా ధర్నాలు లేదా ర్యాలీలు లేదా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని అనుకుంటే, మీరు కనీసం వారం రోజుల ముందు మీరు కార్యక్రమం నిర్వహించే పరిధిలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి మీరు చేయబోయే కార్యక్రమం గురించి తెలుపుతూ, అక్కడ ఒక అప్లికేషన్ తీసుకొని, దాన్ని పూరించి ఆ అప్లికేషన్ తోటి కడప డీఎస్పీ వారి ఆఫీసును సంప్రదించిన ఎడల, డీఎస్పీ మీకు పర్మిషన్ మంజూరు చేయబడునన్నారు. ఎవరైనా గానీ ముందస్తు అనుమతి లేకుండా ఎటువంటి ధర్నాలు లేదా ర్యాలీలు లేదా నిరసన కార్యక్రమాలు నిర్వహించిన ఎడల, వారిపై భారతీయ న్యాయ సంహిత, పోలీస్ యాక్ట్ మేరకు వారిపై చర్యలు తీసుకొవడం జరుగుతుందని ఈ సందర్భంగా డిఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు.

# యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

### - యోగాసనాలు వేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల, పెన్ పవర్ జూన్ 16 :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ యోగ క్రియలను ఆచరించి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యాన్ని పొందాలని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. సోమవారం నంద్యాల పట్టణంలోని టెక్కే మార్కెట్ యార్డు ప్రాంగణంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిధిగా పాల్గొని యోగాసనాలు వేశారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ తదితరులతో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పండుగ వాతావరణంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో దాదాపు 5200 మంది ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ యోగ చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించడం, ఏకాగ్రతను పెంచడంతో పాటు శారీరక ధృఢత్వాన్ని పెంపొందించడంలో సహాయపడుతుందన్నారు. అమరావతి రాజధాని శంకుస్థాపనకు ప్రధానమంత్రి వచ్చిన సందర్భంలో జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి రావలసిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని యోగ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంద న్నారు. వయసు సహకరించకపోయిన ఆరోగ్యం కోసం తాను ప్రతిరోజు నడకతో పాటు స్కిప్పింగ్ చేసే అలవాటు వుండేదన్నారు. కడుపునిండా తిని యోగా చేస్తే ఏం ప్రయోజనం వుండదని, శ్రద్ధ ఆసక్తిని ఉంటేనే యోగా చేయగలుగుతామన్నారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రతి మనిషి తన జీవన తరువాయి 4లో..



## యాడికి కెనాల్ పూడికతీత పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతాం : కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, జూన్ 16 :** యాడికి కెనాల్ పూడికతీత పనులు చేపట్టేందుకు చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పేర్కొన్నారు. సోమవారం యాడికి మండలంలోని పచ్చరమేకలపల్లి వద్ద యాడికి కెనాల్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డి, తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డి మాట్లాడుతూ క్రిష్టిపాడు రెగ్యులేటర్ నుంచి వచ్చే యాడికి కెనాల్ లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని కోరారు. ఇప్పటికే సొంత నిధులతో కొన్ని పనులు చేశామని, మిగిలిన పనులు చేపట్టాలని కోరారు. దీనివల్ల భూగర్భజాలలు పెరుగుతాయని ప్రజలు కోరారని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రతి సంవత్సరం యాడికి కెనాల్ ద్వారా నీరు అందించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యాడికి కెనాల్ పూడికతీత పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మ్యాప్ ద్వారా యాడికి మండలంలో కెనాల్ కింద ఏఏ గ్రామాలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జల వనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, ఏఈలు పెన్నారెడ్డి, శివశంకరప్ప, ప్రజలు పాల్గొన్నారు.

## టిటిడి ప్రతిష్ట పెంచేలా ఢిల్లీ ఎస్వీ కళాశాల

### శ్రీ వేంకటేశ్వర కళాశాల గవర్నింగ్ బాడీ ఛైర్మెన్‌గా బీఆర్ నాయుడు ఎంపిక



**తిరుమల పెన్ పవర్ జూన్ 16 :** టిటిడి ప్రతిష్టను మరింత పెంచేలా ఢిల్లీ శ్రీ వేంకటేశ్వర కళాశాలను రూపొందించాలని అధికారులను టిటిడి ఛైర్మెన్ శ్రీ బీఆర్ నాయుడు కోరారు. తిరుపతి శ్రీ పద్మావతీ అతిథి గృహంలో టిటిడి ఈవో జె.శ్యామలరావు, గవర్నింగ్ బాడీ సభ్యులతో సోమవారం 155వ గవర్నింగ్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్వీ కళాశాల గవర్నింగ్ బాడీ ఛైర్మెన్‌గా బీఆర్ నాయుడు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గవర్నింగ్ బాడీ ఛైర్మెన్‌గా ఎంపికైన టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడును గవర్నింగ్ బాడీ సభ్యులు అభినందించారు. ఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా టిటిడి నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర కళాశాలలో అవసరమైన మౌళిక సదుపాయాల పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు సూచించారు. ఎస్వీ కళాశాలలో తెలుగు విద్యార్థులకు అడ్మిషన్ల కోటాలో ప్రాధాన్యత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తరాది వైపున ఉన్నటిటిడి ఆలయాలలో, ఢిల్లీలోని ఎస్వీ కళాశాలకు ఇంజనీరింగ్ పనులు చేపట్టేందుకు వీలుగా ప్రత్యేకంగా ఇంజనీరింగ్ ఈఈ విభాగాన్ని ఏర్పాటు చేయాలని టిటిడి ఈవో జె. శ్యామలరావుకు టిటిడి ఛైర్మెన్ సూచించారు. ఎస్వీ కళాశాలలో విద్యార్థులకు ఉద్యోగ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేలా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులకు ఉపాధికి అవకాశం ఉన్న వృత్తిపరమైన కోర్సులను ప్రవేశ పెట్టాలని సూచించారు. కళాశాలలో పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణ, ఇంజనీరింగ్ మరమ్మతులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కాలం చెల్లిన భవనాల స్థానంలో భవనాల పునర్నిర్మాణం, ఆడిటోరియం మరమ్మతులు, ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా నూతన టెక్నాలజీతో కళాశాల ప్రవేశంలో మరింత ఆకర్షణీయంగా ఉండేలా మార్పులు చేర్పులు చేపట్టాలన్నారు. కళాశాలకు సంబంధించిన పలు అంశాలను ప్రిన్సిపాల్ డా.వఝల రవి టిటిడి ఛైర్మెన్ తరువాయి 4లో..

## రెవెన్యూ అధికారులు ప్రజలకు సేవలు అందించాలి

### - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ జూన్ 16 :** రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధి తో ప్రజలకు సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం నంద వరం తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ రూమ్, రికార్డు రూము లను పరిశీలించారు. నందవరం మండలంలో రీ సర్వే కింద ఎన్ని గ్రామాలు పూర్తయ్యాయని కలెక్టర్ తహసిల్దార్ ఆరా తీశారు.. 13 గ్రామాలు పూర్తయ్యాయని, మరో నాలుగు గ్రామాల్లో చేయాల్సి ఉందని అధికారులు కలెక్టర్ కు వివరించారు. రీ సర్వే లో పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు..మ్యూటేషన్ కొరకు దరఖాస్తు చేసుకున్న రైతులకు ఫారం 8 ద్వారా ఆ సర్వే నంబర్లు ఉన్న రైతులందరికీ నోటీసులు అందజేసి, విచారణ చేసి, పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మ్యుటేషన్, రీ సర్వే ప్రక్రియలో నోటీసులు ఇవ్వడంతో పాటు, ఆ నోటీసులను అందించినట్లు రుజువులు ఉంచుకోవడం చాలా ముఖ్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. శాశ్వత కుల ధృవీకరణ పత్రం మంజూరు చేయడం ద్వారా ప్రతిసారి అర్జీ దారులు కార్యాలయం చుట్టూ తిరిగే అవసరం ఉండదు కాబట్టి శాశ్వత కుల ధృవీకరణ పత్రం జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, అలాగే ఆదాయ ధ్రువీకరణ పత్రం అర్జీ దారులకు త్వరగా అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులను గడువులోపు పరిష్కరించాలన్నారు... ఈరోజు నిర్వహించిన పబ్లిక్ (గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్-పిజిఆర్ఎస్) ఎన్ని అర్జీలు వచ్చాయని కలెక్టర్ తహసీల్దార్ ని అడిగి తెలుసుకున్నారు..అర్జీ దారుల సమస్యలను సకాలంలో పరిష్కరించి అర్థమయ్యే రీతిలో ఎండార్స్‌మెంట్ లు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు..వ్యక్తిగతంగా మాట్లాడి, అర్జీదారులు సంతృప్తి పొందేలా సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, నందవరం మండల తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో పుల్లయ్య, తదితరులు ఉన్నారు.

## 27 నుంచి శ్రీకాళహస్తిలో బ్రహ్మోత్సవాలు



**శ్రీకాళహస్తి :పెన్ పవర్ ప్రతినిధి జూన్ 16 :** శ్రీకాళహస్తి శ్రీద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి ఆలయంలో ఈనెల 27వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో బాపిరెడ్డి ఓ ప్రకటనలో వెల్లడించారు. జులై 9వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయన్నారు. ద్రౌపదీ కళ్యాణం, అర్జున తపస్సు, అగ్నిగుండ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు.

## ప్రజా సమస్యలను వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించండి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్ రాజకుమారి గణియా





**నంద్యాల, పెన్ పవర్ జూన్, 16 :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో నిశితంగా పరిశీలించి వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించి అనంతరం పలు అంశాలపై అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి స్వీకరించిన విజ్ఞప్తులను నాణ్యతతో వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. భూసర్వేకు సంబంధించి 292 దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎలో ఉన్నాయని సంబంధిత దరఖాస్తులను గ్రామాల వారీగా గ్రామ సర్వేయర్లకు పంపి వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని లాండెడ్ సర్వే ల్యాండ్ అండ్ సర్వే ఏడిని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూకు సంబంధించి 1131 దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎలో ఉన్నాయని త్వరితగతిన పరిష్కరించేందుకు ఆర్డీవోలు తాసిల్దారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అదే విధంగా పెండింగ్ ఉన్న ఆడిట్ కేసులను పూర్తి చేయాలన్నారు. పెండింగ్లో ఉన్న 20వేల పరిష్కరించిన ఫిర్యాదులపై ఫీడ్ బ్యాక్ ను సేకరించాలన్నారు. గ్రామ సచివాలయ సర్వీసులకు సంబంధించి ఆధార్ సీడింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని, మన మిత్రకు సంబంధించి ఇంకా 11వేల మందిని నమోదు చేయాలన్నారు. జియో ట్యాగింగ్‌కు సంబంధించి తరువాయి 4లో..

### 5000 మంది పారిశుద్ధ్య కార్మికులతో
## నేడు యోగా ప్రదర్శన

### - కమిషనర్ యస్.రవీంద్ర బాబు



**కర్నూలు పెన్ పవర్ జూన్ 16 :** యోగాంధ్ర మాసోత్సవంలో భాగంగా మంగళవారం 5 వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో సామూహిక యోగా ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించి ఔట్ డోర్ స్టేడియం మైదానంలో ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని గత నెల రోజులుగా అనేక చైతన్యపరమైన కార్యక్రమాలు నిర్వహించామని, అనేక వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేసి యోగా ఆసనాల శిక్షణను ఇచ్చామన్నారు. మంగళవారం ఔట్ డోర్ స్టేడియంలో 5 వేల మంది పారిశుద్ధ్య కార్మికులతో సామూహిక యోగా ప్రదర్శనను



నిర్వహిస్తున్నామని, జిల్లా నలుమూలల నుండి పారిశుద్ధ్య కార్మికులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారని చెప్పారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నగర ప్రజలు సైతం హాజరు కావాలని కమిషనర్ కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, ఇంచార్జీ ఎస్ఈ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, డిఈఈ గంగాధర్, గిరిరాజ్, నరేష్, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, ఏఈలు పాల్గొన్నారు.

# అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ



**శ్రీకాళహస్తి పెన్ పవర్ జూన్ 16 :** దక్షిణకైలాసంగా విరాజిల్లుతున్న పట్టణం. రాష్ట్రం నుంచేకాకుండా దేశం నలుమూలలనుండి భక్తులు శివయ్యను దర్శించుకునేందుకు వస్తుంటారు. గతంలో వందల సంఖ్యలో దర్శించుకొనే భక్తులు నేడు లక్షలకు చేరింది. భక్తులకు అనుగుణంగానే వాహనాల రద్దీకూడా పెరిగింది. అయితే వాహనాల సంఖ్య గణనీయంగా పెరిగినా కూడా శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఓ వైపు ఆటోలు మరో వైపు బస్సులు, భక్తులతో అటు ట్రాఫిక్ అంతరాయంకలుగుతుంది. ముఖ్యంగా నాలుగుమాదా వీధులతో పాటు జయరామారావు వీధి. సినిమా వీధుల్లో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అనుభవం లేని ఆటో డ్రైవర్లతో పరిస్థితి ఊహాతీతంగా మారింది. మరో వైపు సినిమావీధిలో ఓ మాల్ ముందు ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేయటంతో పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. ఇక సన్నిధివీధిలో గమనిస్తే ఇరుకురోడ్లపై ఆలయానికి వచ్చిన భక్తుల కార్లు, మరోవైపు ఆలయానికి వచ్చిన భక్తుల ద్విచక్రవాహనాలతో గందరగోళంగా మారుతుంది. శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి దశాబ్దాలుగా ఉన్నతాధికారులు, పాలకుల ప్రకటనలే తప్ప ఆచరణకు నోచుకోవటం లేదు. పుణ్యక్షేత్రంలో ట్రాఫిక్కు ప్రత్యేక సిబ్బంది ఎంతో అవసరం అయితే ఆ దిశగా పాలకులు స్పందించటం లేదు.

గతంలో ట్రాఫిక్కు క్రమబద్ధీకరించుటకు ఫిస్టుకు పది మంది ఉండేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. వన్డేన్లో ఉన్న సిబ్బందితోనే ట్రాఫిక్కు నిర్వహించాల్సి వస్తుంది. దాంతో ఒక్కొక్క రోడు డివైయస్ పి, మరో రోజు సిఐలు పర్యవేక్షించే దుస్థితి చోటు చేసుకుంది. గతంలో కుమారస్వామి తిప్ప,టౌన్ పోలీసుస్టేషన్ సర్కిల్ నుంచి వాహనాలను మళ్ళించటంతో బేరివారి మండవం మీదుగా దేవస్థానంకు వెళ్ళె వారు. ట్రాపిక్కు సిబ్బంది లేకపోవటంతో కుమారస్వామి తిప్ప నుంచి నేరుగా పెళ్ళి మండపం మీదుగా వెళుతుండటంతో ట్రాపిక్ కష్టాలు తప్పటం లేదు. దాంతో స్థానికులకు తిప్పలు తప్పటం లేదు. ఇప్పటికైనా జిల్లా ఎస్పి ట్రాఫిక్కు ప్రత్యేక సిబ్బంది లేదా? ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ను మంజూరు చేసి ట్రాఫిక్ కష్టాలను తీర్చాలని కోరుతున్నారు..

## కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, ఎస్పీ




**మంత్రాలయం పెన్ పవర్ జూన్ 16 :** మంత్రాలయంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు.

## వర్మీ కంపోస్ట్ ను రైతులు వాడుకునే విధంగా రైతులకు అవగాహన

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**కర్నూలు , పెన్ పవర్ జూన్ 16 :** నిర్దేశించిన లక్ష్యాల మేరకు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం నందవరం మండల కేంద్రములోని ఎంపిడిఓ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలం లో జరిగే అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎంపిడిఓ ను ఆదేశించారు.. ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడి నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫారం పాండ్స్ నిర్దేశించిన లక్ష్యం 194 కాగా ఇందులో 54 మాత్రమే పూర్తి అయ్యాయని, త్వరితగతిన వీటిని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపిడిఓ ను ఆదేశించారు.. ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలు చేయాలని, పొరపాట్లు జరగకుండా, వేతనదారులకు విరివిగా పనులు కల్పించాలని కలెక్టర్ ఎంపిడిఓ ను ఆదేశించారు..తాగునీటి సమస్యలపై కలెక్టర్ ఆరా తీశారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం నీటి సమస్య తక్కువే అని మార్చి 15 వ తేది నాటికి చెరువులను, ట్యాంక్ లను పూర్తిగా నింపడం ద్వారా తాగునీటి సమస్యలు అంతగా లేవన్నారు.. అయినప్పటికీ ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉంటే వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.. నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం క్లోరినేషన్ తప్పనిసరిగా చేయించాలని, సచివాలయ సిబ్బందికి ఈ అంశంపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎంపిడిఓ ను ఆదేశించారు. క్లాప్ మిత్రాలకు పెండింగ్ లో లేకుండా వేతనాలు చెల్లిస్తున్నారా అని కలెక్టర్ ఎంపిడిఓ, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు... చెత్త సంపద తయారీ కేంద్రాల వల్ల గ్రామం శుభ్రంగా ఉండటమే కాకుండా వాటి ద్వారా తయారు చేసిన వర్మీ కంపోస్ట్ ను అమ్మడం ద్వారా పంచాయతీలకు నిధులు కూడా వస్తాయన్నారు..చెత్త సంపద తయారీ కేంద్రాల ద్వారా వచ్చే వర్మీ కంపోస్ట్ ను రైతులు వాడుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎంపిడిఓ ను ఆదేశించారు.. కలెక్టర్ వెంట ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, నందవరం మండల తహసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో పుల్లయ్య, తదితరులు ఉన్నారు.

## "తల్లికి వందనం" కింద ఈనెల 25వ తేదీ వరకు సచివాలయాలలో అభ్యంతరాలు/ఫిర్యాదుల స్వీకరణ

### - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ జూన్ 16 :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా "తల్లికి వందనం" పథకాన్ని అమలు చేస్తోందని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోనేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమ వారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమ అనంతరం తల్లికి వందనం కార్యక్రమం పై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ తల్లికి వందనం పథకం కింద అనర్హులుగా ప్రకటింపబడిన వారి అభ్యంతరాలు/ఫిర్యాదులను ఈ నెల 25వ తేదీలోగా తీసుకోవడం జరుగుతుందన్నారు. అయితే కొంత మంది తల్లులకు అందుకు సంబంధించిన నగదు జమ కాలేదని అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. సదరు దరఖాస్తులను రాష్ట్ర స్థాయిలో 26, 27 తేదీలలో పరిశీలించి అందుకు సంబంధించిన నగదు జూలై 5వ తేదిలోగా వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతోందన్నారు. ఈ నెల 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభం అయ్యాయని... స్పెషల్ అధికారులు సంబంధిత పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఉన్న మౌలిక సదుపాయాలను గుర్తించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు ఉన్న వసతులకు సంబంధించిన ఫోటోలను తీసి పంపాలని కలెక్టర్ మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీఓ, తాసిల్దార్లను ఆదేశించారు.

## అంగనవాడీల పిల్లలకు తల్లికి వందనం వర్తింప చేయాలి




**పలమనేరు, జూన్ 16, (పెన్ పవర్) :** తల్లికి వందనం పథకం కూడా అంగన్వాడి కార్యకర్తల చదువుకునే బిడ్డలకు వర్తింపు చేయాలని కోరుతూ మండలంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ప్రగతిశీల సంఘం అంగనవాడి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఆర్.జ్యోతి మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తలను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలన్నారు. ప్రభుత్వం అంగనవాడీల పైన చూపుతున్న చిన్న చూపు పై ఆమె గట్టిగా ప్రశ్నించారు. కనీస వేతనం చెల్లించాలని ఇతర ప్రభుత్వపరంగా అలవెన్సులు ఇవ్వాలని కోరారు. లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులకు పంటల సాగుపై అవగాహన సదస్సు

**పెళ్లకూరు :పెన్ పవర్ ప్రతినిధి జూన్ 16 :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయుడుపేట సబ్ డివిజన్ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగార్జునసాగర్, అలాగే మండల వ్యవసాయ అధికారి సిహెచ్. విజయభారతి లకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాల గురించి యూరియా సరఫరా రైతులకు అందుతున్న సేవలు వివరించడం జరిగింది. అలాగే పెళ్లకూరు గ్రామంలో సాగులో ఉన్న వరి పైరును పరిశీలించడం జరిగింది. ప్రస్తుతం వరి పైరును"నల్లి" ఆశించి ఉంది దాని నివారణకు ఓ మైట్ అనే ముందును 2ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసి నివారించుకోవాలి మూడో విడత ఎరువులు వేసేటప్పుడు తప్పకుండా ఎకరాకు 20 కేజీల పోటాష్ వేసుకోవాలి. దీనివల్ల అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ నాగార్జునసాగర్, ఎంఏఓ విజయభారతి, విఏఏలు, రైతులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

### జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ జూన్ 16 :** అర్జీల పరిష్కారంలో నాణ్యత ఉండేలా చూసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారాలపై అధికారులతో సమీక్షించారు.. పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు....పిజిఆర్ఎస్ కు సంబంధించి రీఓపెన్ కేసుల మీద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను అలసత్వం వహించకుండా పెండింగ్ లో లేకుండా ఎప్పటికపుడు చూడాలన్నారు. సిఎంఓ గ్రీవెన్స్ కు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 9, కర్నూలు ఆర్డీఓ వద్ద 6, పత్తికొండ ఆర్డీఓ వద్ద 4, కలెక్టరేట్ ఏఓ వద్ద 3, సర్వే ఏడి , విద్య శాఖ, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్, డిఆర్డిఏ పిడి, ల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్ లో ఉన్న వాటిని బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**ఈ నెల 17 న కర్నూలు నగరంలో పారిశుధ్య కార్మికులతో యోగా కార్యక్రమం నిర్వహణ :**

థిమాటిక్ యోగా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17 న కర్నూలు నగరంలోని ఔట్ డోర్ స్టేడియం లో పారిశుధ్య కార్మికులతో యోగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు..ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు వారి సిబ్బంది కూడా హాజరు కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..కార్యక్రమం విజయవంతం అయ్యేలా అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు ను ఆదేశించారు. జూన్ 21 వ తేదీ ప్రపంచ యోగా దినోత్సవంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వైజాగ్ లో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొననున్నారన్నారు..రాష్ట్రంలో జూన్ 21 వ తేదీన యోగా కార్యక్రమంలో 2 కోట్ల మంది ప్రజలు పాల్గొననున్నారని, ఇందులో భాగంగా కర్నూలు జిల్లా నుండి దాదాపు 11 లక్షల మంది పాల్గొనేలా రిజిస్ట్రేషన్ చేయించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా అంతటా అన్ని వేదికల్లో ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా మండలాల్లో యోగా కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్లు, తహసిల్దార్లు, ఎంపిడిఓ లను ఆదేశించారు..మండల స్పెషల్ అధికారులు వారికి కేటాయించిన మండలాలకు వెళ్లి సంబంధిత సిబ్బందితో సమీక్ష నిర్వహించుకుని గుర్తించిన వెన్యూ ప్రదేశాలలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాలను పకడ్బందీగా విజయవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. యోగాకు సంబంధించి నిర్వహించిన వివిధ కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో అప్లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో హెూల్ బ్లడ్, ప్యాకెడ్ సెల్స్ : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ జూన్, 16 :** తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులు జిల్లాలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రంలో నమోదు చేసుకుంటే ఉచితంగా రక్తం అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం కెసి కెనాల్ కార్యనిర్వహక ఇంజనీర్ కార్యాలయ ఆవరణంలో ఉన్న రక్త నిల్వ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్ బాబు, కోఆర్డినేటర్ అబ్దుల్ సమీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులు జిల్లాలో ఏర్పాటు చేసిన రక్త నిల్వ కేంద్రంలో నమోదు చేసుకుంటే ఉచితంగా రక్తం అందజేయడం జరుగుతోందన్నారు. అదే విధంగా రక్త నిల్వ కేంద్రంలో హెూల్ బ్లడ్ మరియు ప్యాకెడ్ సెల్స్ విడివిడిగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈనెల 14న ప్రపంచ రక్తదాన దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని రక్తనిధి నిల్వ కేంద్రంలో హెూల్ బ్లడ్ మరియు ప్యాకెడ్ సెల్స్ అందుబాటులో వుంచామన్నారు. అత్యవసరమైన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం రక్త నిల్వ కేంద్రంలో ఉన్న ఫ్రీజర్, ఇంక్యుబేటర్, హాట్ ఎయిర్ ఓవెన్ పరికరాల పనితీరును కలెక్టర్ సిబ్బందిని అడిగి తెలుసుకొని వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా చూడాలన్నారు. అదే విధంగా రక్త నిల్వ కేంద్రంలో ప్రథమ చికిత్సలకు సంబంధించి కూడా అవసరం మేరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్వాహకులను కలెక్టర్ సూచించారు. అనంతరం ఆవరణంలో నీడను ఇచ్చే మొక్కలను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నిర్వాహకులు రక్త నిల్వ కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 307 అర్జీలు

### పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలకు త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్




**తిరుపతి, పెన్ జూన్ 16 :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపి మానవతా దృక్పదంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయ మునకు మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు వేసవి దృష్ట్యా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన పిజిఆర్ఎస్ పరిష్కార వేదిక ఆవరణంలో వారు కూర్చోడానికి వీలుగా కుర్చీలు, త్రాగునీటి సౌకర్యం కల్పించి వచ్చిన అర్జీదారులకు అందించి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారియొక్క సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓ లు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు.

ఈ సందర్భంగా పీజిఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని, పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ , జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, సుధా రాణి, రోజ్ మాండ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో అర్జీదారులకు రసీదులు అందించారు.

## పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతగా పరిష్కారం : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, పెన్ పవర్ జూన్ 16 :** పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతగా పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. యాడికి మండల కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) కల్యాణ మండపంలో సోమవారం పంచాయతీ సెక్రెటరీలు, వీఆర్వోలు, వార్డు సెక్రటరీలతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) అర్జీల పరిష్కారంపై గ్రామస్థాయి అధికారులకు సరైన అవగాహన ఉండాలన్నారు. ప్రతిరోజు ఒక సచివాలయాన్ని యాదృచ్ఛికంగా డీఎల్డీవో తనిఖీ చేయాలని, 10 గంటలకు ఎంత మంది అధికారులు వచ్చారు అనేది చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా భూమిని ఇతరులను కబ్జా చేశారు, జాయింట్ ఎల్పిఎం వస్తే ఎలా పరిష్కరిస్తారు, మిగులు భూమి సమస్య వస్తే ఎలా పరిష్కరిస్తారు అనే పిజిఆర్ఎస్ అర్జీలకు సంబంధించి పంచాయతీ సెక్రెటరీలు, వీఆర్వోలు, వార్డు సెక్రటరీలతో అడిగి తెలుసుకున్నారు. సరిగా సమాధానం ఇవ్వని వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్డిఓను ఆదేశించారు. మండలంలో నెలకొన్న నీటి, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, గుంతకల్లు ఆర్డీవో ఏబివిఎన్ శ్రీనివాసులు, డిపిఓ నాగరాజు నాయుడు, డిఎల్డిఓ విజయలక్ష్మి, జడ్పి సిఈఓ రామసుబ్బయ్య, తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీవో వీర రాజు, పంచాయతీ సెక్రెటరీలు, వీఆర్వోలు, వార్డు సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి ప్రతిష్ట పెంచేలా ఢిల్లీ ఎస్వీ కళాశాల

**(3వ పేజీ తరువాయి)** ఈవోల దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించనున్న గవర్నింగ్ బాడీ సమావేశం నాటికి కళాశాల అభివృద్ధి పనులపై పూర్తి స్థాయి నివేదికను తయారు చేయాలని అధికారులను ఛైర్మెన్ కోరారు. ఈ సమావేశంలో టిటిడి బోర్డు సభ్యులు డా. పనబాక లక్ష్మీ, శ్రీ ఎస్. నరేష్ కుమార్, ఎండోమెంట్ కమీషనర్ కె. రామచంద్ర మోహన్, ఎఫ్.ఏ అండ్ సీఏవో ఓ.బాలాజీ, సీఈ టివి సత్యనారాయణ, టిటిడి డీఈవో వెంకట సునీల్, పలువురు గవర్నింగ్ బాడీ ప్రతినిధులు, టిటిడి అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను వేగవంతంగా, నాణ్యతతో పరిష్కరించండి

**(3వ పేజీ తరువాయి)** ఇంకా 683 సర్వీసులు పెండింగ్ ఉన్నాయని, అదే విధంగా ఈ–కెవైసి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

**పిజిఆర్ఎస్ లో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు :** బండి ఆత్మకూరు మండల కేంద్రంలోని వీవర్స్ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగ డ్రైనేజీ కాలువలు, సైడ్ కాలువలు లేనందున కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, అలాగే మంచి నీటి సమస్య కూడ ఉందని....మా కాలనీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వీవర్స్ కాలనీ వాసులు జిల్లా కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు. రుద్రవరం మండలం బిరవోలు గ్రామ వాస్తవ్యుడు నరేష్ తన కూతురు ఆరవ తరగతి జ్యోతిరావు పులే స్కూల్ పాణ్యంలో చదువుతున్నదని తల్లికి వందనం డబ్బులు తల్లి చ తండ్రి అయిన నా అకౌంట్లో వేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో 172 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

**(3వ పేజీ తరువాయి)** శైలిలో యోగాను నిత్యం అలవరచుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నెల రోజుల పాటు అన్ని గ్రామ, మండల, పట్టణ ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేసి సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంతతను అలవర్చుకోవాలన్నారు. జిల్లాలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన శ్రీశైలం, మహానంది, బెలుం గుహల ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరిగిందన్నారు. జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా దాదాపు 7.6 లక్షల మంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు నమోదు అయ్యారని ఎందుకోసం ప్రతి గ్రామ, వార్డు అన్ని ప్రాంతాల్లో పెద్ద ఎత్తున యోగాంధ్ర కార్యక్రమం చేపట్టేందుకు పటిష్ట ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ తెలిపారు. యోగా చేయడం వల్ల కుటుంబాన్ని కార్యాలయాన్ని సమతుల్యం చేస్తూ ఒత్తిడికి గురికాకుండా ఉత్సాహంగా పనిచేసేందుకు ఉపకరిస్తుందన్నారు. ప్రస్తుతం చేసిన యోగ ప్రోటోకాల్ ప్రతినిత్యం ఆచరించాలన్న ప్రధాన ఉద్దేశంతోనే ప్రభుత్వం నెలరోజుల పాటు యోగా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని... ఈ మేరకు ఉద్యోగులందరూ నిత్యము యోగాను ఆచరించి ఆరోగ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పొందాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడానికి సహకరించిన హెల్త్ ఆయుష్ శాఖలను, రామచంద్ర మిషన్ సభ్యులు, యోగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ అందరితో కలిసి యోగా చేయడం వల్ల మానసిక ఉత్తేజితంగా ఉందని.. ప్రతినిత్యం అలవరచుకుంటే శరీరారోగ్యం బాగుంటుందన్నారు. ఈ నెల 21వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 5 కోట్ల మందిచే యోగభ్యాసనాలు వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాలైన శ్రీశైలం, మహానంది, బెలూం గుహలలో యోగా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. అదే విధంగా అహెూబిలం, పచ్చర్లలో కూడా యోగ కార్యక్రమాలు చేయాల్సి ఉందన్నారు. యోగ అనేది మానవ జీవనశైలిలో భాగం చేసుకోవాలన్నారు. జిల్లాలో యోగ పట్ల ఆసక్తి ఉండి నమోదు చేసుకున్న 7.60 లక్షల మందికి 380 మాస్టర్ ట్రైనర్స్, 4900 ట్రైనర్స్ ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. అంతకుముందు రామచంద్ర మిషన్ యోగా గురువు ఆషా, బృంద సభ్యులు యోగాంధ్ర కార్యక్రమంలో వృక్షాసనము, వక్రాసనము, సేతు బందాసనం, తాడాసనం, ఉత్తాన పాదాసనము, పవనముక్తాసనము, అర్థ చక్రాసనం, శలభాసనము, ఉష్ట్రాసనం, పాదహస్తానము, దండాసనము మొదలైన ఆసనాలను వేయించారు. అలాగే కపాలభాతి, అనులోమ విలోమ, శీతలి, భ్రామరి మొదలైన విధానాలతో ప్రాణాయామం చేయించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డిఓ విశ్వనాథ్, డీఎంహెచ్ఓ వెంకటరమణ, ఆయుష్ సీనియర్ మెడికల్ అధికారి యశోధర, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు యోగాంధ్ర కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

## అధికారులు ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదు

### జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



**వైయస్సార్ కడప పెన్ పవర్, జూన్ 16 :** ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్ లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) లో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ లు హాజరై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన విజ్ఞప్తులలో కొన్ని.. లింటిమిట్ట మండలానికి చెందిన వెంకటసుబ్బమ్మ తమ పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింప జేయాలని అభ్యర్తించారు. తొండూరు మండలానికి చెందిన శ్రీనివాసులు పంట నష్టపరిహారం ఇప్పించాలని అర్జీని సమర్పించారు. వేంపల్లి మండలానికి లక్ష్మీ నారాయణ తన భూ సమస్యను పరిష్కరించాలని అర్జీని సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఎస్డీసీ వెంకటపతి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, డిఆర్డీఏ పిడి రాజ్యలక్ష్మి, మెప్మా పిడి కిరణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ నెల దర్శన కోటా విడుదల వివరాలు

**తిరుమల పెన్ పవర్ జూన్ 16 :** సెప్టెంబర్ నెలకు సంబంధించి టీటీడీ విడుదల చేయు వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన సెప్టెంబర్ నెల కోటాను జూన్ 18న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం జూన్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు జూన్ 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి.

**21న ఆర్జిత సేవా టికెట్ల విడుదల :** కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను జూన్ 21న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు.

**21న వర్చువల్ సేవల కోటా విడుదల :** వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను జూన్ 21న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**23న అంగప్రదక్షిణం టోకెన్లు :** అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను జూన్ 23న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**శ్రీవాణి టికెట్ల ఆన్ లైన్ కోటా :** శ్రీవాణి ట్రస్టు టికెట్ల ఆన్ లైన్ కోటాను జూన్ 23వ తేదీ ఉదయం 11 గంటలకు టీటీడీ విడుదల చేయనుంది.

**వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా :** వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను జూన్ 23న మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా విడుదల :** ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను జూన్ 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**తిరుమల, తిరుపతిలలో గదుల కోటా విడుదల :** తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను జూన్ 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

**25న శ్రీవారి సేవా ఆగస్టు నెల కోటా విడుదల :** శ్రీవారి సేవ(తిరుమల మరియు తిరుపతి), పరకామణి సేవ, నవనీత సేవ, గ్రూప్ సూపర్వైజర్ల సేవల ఆగస్టు నెల కోటాను జూన్ 25న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరడమైనది.

## మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషాకు ఘన సత్కార్



**కడప పెన్ పవర్ జూన్ 15 :** కడప నగరంలోని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ భాషా క్యాంప్ కార్యాలయంలో,నూతనంగా నియమితులైన కడప నగర మైనారిటీ సెల్ అధ్యక్షుడు షఫీ, వారి కమిటీ సభ్యులు ఎస్.బి.అంజాద్ భాష గారిని కలిసి ధన్యవాదాలు తెలియజేసి సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాషా, “పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని, నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శ్రీకాళహస్తి ఏఐటీయుసి నూతన కార్యవర్గాన్ని ఎన్నిక



**శ్రీకాళహస్తి: పెన్ పవర్ ప్రతినిధి జూన్ 16 :** శ్రీకాళహస్తి అంబేద్కర్ భవన్లో ఏఐటీయుసి, 3వ మహాసభలు రెండు రోజుల పాటు నిర్వహించను న్నారు. ఇందులో భాగంగా సోమవారం ఏఐటీయుసి, జిల్లా కౌన్సిల్ 31 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వైఎస్ మణి, కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జున్, కోశాధికారిగా మురళీ, ఉపాధ్యక్షు రాలిగా శశిరేఖ, రాజేశ్వరి, హరి, చంద్రకళ, పాండు, గురు బాలాజీ, గోవర్ధన్ ఎన్నికయ్యారు.

## వాళ్లను డ్రైవర్లుగా తీసుకోవద్దు : శ్రీకాళహస్తి ఆర్‌టిఓ



**శ్రీకాళహస్తి: పెన్ పవర్ ప్రతినిధి జూన్ 16 :** శ్రీకాళహస్తిలో 90 పాఠశాలల బస్సులు ఉండగా, వాటిలో 70 బస్సులకే ఫిట్నెస్ ఉందని రవాణా శాఖ అధికారి దామోదర్ నాయుడు అన్నారు. డివిజన్ పరిధిలోని పాఠశాలల యజమానులతో శ్రీకాళహస్తి మండలం చెర్లోపల్లి ఆర్టీవో కార్యాలయంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. మిగిలిన బస్సులను పూర్తిస్థాయిలో కండిషన్లో ఉంచుకోవాలని సూచించారు. 60 ఏళు పైబడిన వ్యక్తులను డ్రైవర్లుగా తీసుకోవద్దని స్పష్టం చేశారు.

## జిల్లాలో పలు సమస్యలపై జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు



**శ్రీకాళహస్తి: పెన్ పవర్ ప్రతినిధి జూన్ 16 :** తిరుపతి జిల్లా డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో ఈ దినం కలెక్టర్ ఆఫీస్ నందు జరిగిన గ్రీవెన్స్ డే సందర్భంగా తిరుపతి జిల్లాలోని పలు సమస్యలపై వినతి పత్రాన్ని జాయింట్ కలెక్టర్ కు అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు శబరి రాజన్ రెడ్డి, ఓ బి సి జిల్లా అధ్యక్షులు భాస్కర్ యాదవ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు తడ బాబు, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, నిత్యానంద, పులి వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి





**నంద్యాల, పెన్ పవర్ జూన్ 16 :** వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గట్టి చర్యలు తీసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం స్టాప్ డయేరియా పోస్టర్ ను ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల నీరు కలుషితం కాకుండా మున్సిపల్ కమీషనర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, ఎంపిడిఓలు, తహశీల్దార్లు, ఈఓఆర్డిలు చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల్లో ఎక్కడైతే చెత్త చెదారం ఎక్కువ ఉంటుందో వాటిని ఆశా, ఎఎన్ఎం వెక్టార్ యాప్ లో ఫోటో తీసి అప్లోడ్ చేయడం జరుగుతుందని, వాటిని పంచాయతీ సెక్రటరీ పరిశీలించి క్లియర్ చేయాలన్నారు. అదే విధంగా వాటర్ అండ్ శానిటేషన్ యాప్ లో కూడా హెచ్2ఎస్ పరీక్షలు నిర్వహించి ఎక్కడా నీటి కలుషితం జరగకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. అదే విధంగా పిఆర్ వన్ యాప్‌లో సరైన డేటా నమోదు చేయాలన్నారు.

## చిన్నపిల్లలలో అతిసార నిలుపుదల అవగాహన కార్యక్రమం : కలెక్టర్ వెంకటేశ్వర్



**తిరుపతి, పెన్ పవర్ జూన్ 16 :** చిన్న పిల్లలలో అతిసార నిలుపుదల ఈ కార్యక్రమము పై బ్యానర్స్ మరియు పోస్టర్స్ ను జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్‌తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఐదు సంవత్సరముల లోపు వయస్సు గల పిల్లలలో అతిసార నియంత్రణ కొరకు ఈ నెల 16 వ తేదీ నుండి జూలై 31 వరకు స్టాప్ డయేరియా అమలు దశ కార్యక్రమము అమలు చేయ బడునని తెలిపారు. రోజుకు 3 కంటే ఎక్కువ సార్లు నీళ్ళ విరేచనాలు అయితే డయేరియా గా భావించాలని పిల్లలలో ఇది ప్రమాద కర సూచన కనుక తల్లి తండ్రులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. డయేరియా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 4.8% మరణాలకు దోహదం చేస్తుంది కనుక విరేచనాల వల్ల కలిగే దాదాపు అన్ని మరణాలను ముందస్తుగా గుర్తించడం, నిర్వహణ మరియు నిర్జలీకరణ నివారణ ద్వారా (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్) తో పాటు జింక్ మాత్రలు ఇవ్వడం తో బాటు మరియు విరేచనాల సమయంలో పిల్లలు తగినంత పోషకాహారం తీసుకోవడం ద్వారా నివారించవచ్చు అని తెలిపారు. 2 నెలల నుండి 6 నెలల వయసు వరకు సగం జింక్ టాబ్లెట్ ఇవ్వాలని 6 నెలల తరువాత నుండి 5 సం ల వయస్సు వరకు ఒక మాత్ర ఓ ఆర్ఎస్‌తో బాటు ఇవ్వాలన్నారు. ఈ సమస్యను సమర్థవంతంగా పరిష్కరించడానికి, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ (MoHFW) 2025లో “STOP డయేరియా ప్రచారం”ను అమలు చేస్తోందని STOP డయేరియా ప్రచారం” 2025 చేపట్టాల్సిన ప్రధాన కార్యకలాపాలలో ఈక్రింది ఆచరించ వలసిన విధులు ఉన్నాయని అన్నారు. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు ఉన్న ఇళ్లకు ASHA ద్వారా ORS & జింక్ కో-ప్యాకేజింగ్ పంపిణీ, ఆరోగ్య కేంద్రాలు&అంగన్‌వాడీ స్థాయిలలో ORS-జింక్ కార్నర్‌లను ఏర్పాటు చేయడం. విరేచనాల నిర్వహణ కోసం న్యాయవాద మరియు అవగాహన ఉత్పత్తి కార్యకలాపాలను తీవ్రతరం చేయడం, విరేచనాల కేసు నిర్వహణ కోసం సేవా సదుపాయాన్ని బలోపేతం చేయడం మరియు మెరుగైన అమలు కోసం ఇతర విభాగాలతో ఇంటర్‌సెక్టోరల్ కన్వర్జన్స్ సమావేశాలు నిర్వహించడం. ఈ కార్యక్రమంలో డిఎల్ ఎటి ఓ మరియు అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఛత్ర ప్రకాష్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా. ఆనందమూర్తి, డా.రాజా డాక్టర్ అభిజ్ఞ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నవోదయ విద్యాలయంకు స్థలం, మహా గురుకులం భవన సముదాయాలు, స్మశాన స్థల పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్



**కడప, పెన్ పవర్ జూన్ 16 :** మైదుకురు నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో భాగంగా.. బి.మఠం మండలంలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తో కలిసి.. బ్రహ్మంగారి మఠం మండలంలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థల సేకరణ కోసం పలుగురాళ్లపల్లె గ్రామ పరిధిలోని ప్రభుత్వ రెవెన్యూ భూములను పరిశీలించారు. పేదలకు మెరుగైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో జిల్లాలోని బి. మఠం మండలంలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. విద్యాలయ నిర్మాణం కోసం అవసరమైన, అనువైన ప్రభుత్వ స్థలాన్ని.. మండలంలోని పలుగురాళ్లపల్లె రెవెన్యూ గ్రామంలో పరిశీలించడం జరిగిందనన్నారు.

**మహా గురుకుల భవన సముదాయాల పరిశీలన.. :**



బి.మఠం మండలంలోని తోట్లపల్లె పంచాయతీలో నూతనంగా నిర్మితమైన డా.బి.ఆర్. అంబేద్కర్ మహా గురుకుల (బాలుర) విద్యాలయం భవన సముదాయాలను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ తో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల భవన సముదాయాన్ని, వసతి గృహ సముదాయాన్ని, డైనింగ్, కిచెన్ తదితర భవనాలను పరిశీలించారు. నాణ్యత సరిగా లేవని గమనించిన జిల్లా కలెక్టర్ కాంట్రాక్టర్, సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పెండింగ్ పనులన్నింటినీ నాణ్యతలో రాజీ లేకుండా పూర్తి చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, గురుకుల విద్యాసంస్థల జిల్లా కో.ఆర్డినేటర్ ఉదయశ్రీ, స్థానిక నాయకులు, రెవెన్యూ, సంబందిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**స్మశాన స్థలం పరిశీలన.. :**

అనంతరం బి.మఠం మండలం సోమిరెడ్డి పల్లె పంచాయతీ లోని 10 ఎకరాల స్మశాన స్థలాన్ని జిల్లా కలెక్టర్ బద్వేలు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తోకలిసి పరిశీలించారు. గతంలో ఆక్రమణకు గురైన స్మశాన స్థలాన్ని ఎన్ క్రోచ్మెంట్ పనులు చేపట్టి.. పునరుద్ధరించడం జరిగిందన్నారు. బ్రహ్మంగారి మఠానికి చేరువలో ఉన్న ఈ స్మశానం.. మండలంలో అతిపెద్ద పంచాయతీ అయిన సోమిరెడ్డి పల్లె, మఠం ప్రజలకు అత్యంత ప్రాముఖ్యమైనదిగా గుర్తించి.. ఆ స్థలాన్ని ఎవరూ కబ్జా చేయకుండా కాంపౌండ్ వాల్, ఇతర అభివృద్ధి పనులను చేపట్టాలని సంబందిత అధికారులను ఆదేశించారు.

**బ్రహ్మంగారి మఠం సందర్శన... :**

అనంతరం స్థానిక ఎమ్మెల్యేతో కలిసి బ్రహ్మంగారి మఠాన్ని సందర్శించారు. శ్రీశ్రీశ్రీ సద్గురు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో జీవసమాధిని సందర్శించి, కాలజ్ఞానం, ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. కాలజ్ఞాన ప్రతులు, బ్రహ్మంగారి పాదుకలను పరిశీలించారు. అనంతరం మఠం నిర్వాహకులు, పూజారులు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే లను రంగమండపంలో ఆలయ మర్యాదలతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ఆలయ పూజారులు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలను పూర్ణకుంభంతో స్వాగతం పలకడం జరిగింది.

**ఒనిపెంట ఇత్తడి పరిశ్రమ సందర్శన... :**

అనంతరం ఒనిపెంట ఇత్తడి పరిశ్రమను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ తయారయ్యే వస్తువులను పరిశీలించి పరిశ్రమలో ఇత్తడి, రాగి వస్తువుల తయారీదారుల కమిటీ చైర్మన్ ఇస్మాయిల్ తో మాట్లాడారు. వనిపెంటలో ఇత్తడి వస్తువుల తయారీ రంగంలో ఎన్ని కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి ? ప్రస్తుతం ఆ ఉత్పత్తులకు మార్కెట్లో డిమాండ్ తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం నుండి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.







తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మర్యాదపూర్వకంగా కలిసిన వివిధ శాఖ అధికారులు...

## ప్రతిభా వంతుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా హైడ్రాలిక్‌ని అందజేసిన కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి పెన్ పవర్ జూన్ 16 :** ప్రతిభా వంతుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా విభిన్న ప్రతిభావంతునికి ఎమ్ పి లాడ్స్ ద్వారా హైడ్రాలిక్‌నీ జాయింట్ విత్ కార్బన్ ఫైబర్ ఫూట్ 5 సీల్ లైనర్‌ను జాయింట్ కలెక్టర్. శుభం బన్సల్‌తో కలసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ అందజేశారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ శ్రీకాళహస్తి మండలం, ఆంజనేయపురం గ్రామస్తుడైన సుబ్బారాయులు విభిన్న ప్రతిభావంతునికి ఎమ్‌పి లాడ్స్ ద్వారా సుమారు 5 లక్షల 70 వేలు రూపాయలు విలువైన సంగమేశ్వర హెల్త్ ఎయిడ్స్ అండ్ సర్జికల్ ఏజెన్సీ వారు తయారు చేసిన హైడ్రాలిక్ నీ జాయింట్ విత్ కార్బన్ ఫైబర్ ఫూట్ 5 సీల్ లైనర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎమ్ అండ్ హెచ్‌ఓ బాలకృష్ణ నాయక్, ప్రతిభా వంతుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సిఆర్ అండ్ ఎమ్.ఓ జి. కె. రాజశేఖర్, సంగమేశ్వర హెల్త్ ఎయిడ్స్ అండ్ సర్జికల్ ఏజెన్సీ ప్రొపరైటర్ రాజు, ఇంజనీర్ చెంచల్ భారత్ సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్రం మస్తాన్ యాదవ్ నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

కుటుంబ సభ్యులకు పరామర్శించి ధైర్యం చెప్పిన కిలివేటి సంజీవయ్య





**దొరవారి సత్రం,పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 16 :** తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం, గొల్లపాలెం గ్రామంలో, ఈరోజు ఉదయం గుర్రం మస్తానయ్య యాదవ్ కు నివాళులు అర్పించిన సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, దువ్వూరు గోపాల్ రెడ్డి వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వెంట NDCMS మాజీ డైరెక్టర్ జెట్టి వేణు యాదవ్, చిలకా యుగంధర్ యాదవ్, గుర్రం ధరణి యాదవ్, సూళ్లూరుపేట నాగేశ్వరావు చెట్టి, గుర్రం శివ యాదవ్, ఆర్‌టీసీ సుబ్రమణ్యం యాదవ్, సుధాకర్ యాదవ్, కృష్ణ యాదవ్ తదితరులు నివాళులు అర్పించారు.

## శ్రీకాళహస్తిలో అంగన్వాడీ కార్యకర్తల నిరసన




**శ్రీకాళహస్తి :పెన్ పవర్ ప్రతినిధి జూన్ 16 :** శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. తమకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ప్రతి నెలా జీతాలు సక్రమంగా విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో తమ పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

## యోగాంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


18న గండికోటలో యోగా కార్యక్రమం : జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



**వైయస్సార్ కడప పెన్ పవర్,జూన్ 16 :** గండికోట లోయ వద్ద ఈ నెల 18 తేదీన నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం పిజిఆర్ఎస్ హాలులో అర్జీలు స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహిస్తోందని అన్నారు.యోగాంధ్ర-2025 మాసోత్సవాల్లో భాగంగా జూన్ 18వ తేదీన గండికోట లోయ వద్ద ఉదయం 6 గం నుండి 8గంటల మధ్య నిర్వహించే యోగాంధ్రా కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవ్వాలని సూచించారు. అలాగే జమ్మలమడుగు నియోజకవర్గం మండలాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులందరూ హాజరు కావాలన్నారు. అలాగే అధిక సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు జూన్ 21వ తేదీన జరగబోయే యోగాంధ్ర కార్యక్రమానికి ఎనిమిది లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. జూన్ 20వ తేదీ వరకు సమయం ఉన్నందున రిజిస్ట్రేషన్‌ల సంఖ్య పెంచాలని సంబంధిత అధికారులకు సూచించారు.

### మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషాను సత్కరించిన నూతన కడప నగర ఉపాధ్యక్షులు బాలకొండయ్య బీసీ సంఘం నేత, అమరేశ్వర్ రెడ్డి





**కడప పెన్ పవర్ జూన్ 16 :** కడప నగరంలోని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ భాషా క్యాంప్ కార్యాలయంలో నూతనంగా నియమితులైన కడప నగర ఉపాధ్యక్షులు బాలకొండయ్య బీసీ సంఘం నేత, అమరేశ్వర్ రెడ్డి,.. ఎస్.బి.అంజాద్ భాష గారిని కలిసి ధన్యవాదాలు తెలియజేసి సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాషా, “పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు క్షేత్రస్థాయిలో కృషి చేయాలి” అని, నూతన నగర ఉపాధ్యక్షులు ఓర్సు బాలకొండయ్య , అమరేశ్వర రెడ్డికి లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ టిటిడి బోర్డు సభ్యులు యానాదయ్య, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, జిల్లా అధికార ప్రతినిధి జయచంద్రారెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, ఈస్ట్ జోన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, రమేష్ , వైఎస్ఆర్సిపి కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో సుద్దాల అశోక్ తేజ..



శ్రీకాళహస్తి :పెన్ పవర్ ప్రతినిధి జూన్ 16 : తెలంగాణకు చెందిన ప్రముఖ కవి, రచయిత సుద్దాల అశోక్ తేజ సోమవారం కుటుంబ సమేతంగా శీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రజా కళావేదిక వ్యవస్థాపకుడు అరవ జయపాల్, వేటపాలెం కళాశాల ప్రిన్సిపాల్, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయితా మురళి కృష్ణ దంపతులు వారికి స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల దర్శనం తర్వాత శాలువాతో సన్మానించారు.

## దళితుల భూముల సమస్యలను పరిష్కరించాలి

### ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి




**కడప పెన్ పవర్ జూన్ 16 :** ప్రభుత్వాలు దళితులకు భూమిని కేటాయించి, భూమికి సంబంధించిన డిపారము,పాసు పుస్తకం,1 బి అడంగల్, ఆర్ డి టి రిపోర్టు. ఎండస్ మెంట్, స్కెచ్ లు, అన్ని పత్రాలు ఉన్న దళితులు వారి భూమిని వారు సాగు చేసుకునే పరిస్థితి లేదని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి అన్నారు. సోమవారం కడప ఆర్డీవో కార్యాలయం నందు దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో పాత కడప దళిత రైతుల భూమి సమస్యను పరిష్కరించాలని రిలే దీక్షలను చేపట్టేరూ, దీక్షలను ప్రారంభించడానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ పాత కడప దళిత రైతుల భూమి సమస్యను పరిష్కరించాలని ఎమ్మార్వో ఆర్డీవో పోలీసులను, కలెక్టర్ మొదలుకొని రాష్ట్ర సచివాలయం వరకు ఉన్న అన్ని కార్యాలయాల చుట్టూ తిరిగామని, కోర్టు మెట్లు కూడా ఎక్కామని అయినా కూడా దళితుల భూమి సమస్యను పరిష్కరించిన అధికారులు కరువయ్యారని ఆయన తెలిపారు. సుబ్బారెడ్డి దౌర్జన్యంగా భూమి ఆక్రమిస్తూ ఉంటే అధికారులు ఎందుకు ఆయనపై చర్యలు తీసుకోవడం లేదని, వెంటనే సుబ్బారెడ్డి అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు ఇచ్చిన భూమిని దానికి వచ్చిన సమస్యలను పరిష్కరించలేని అధికార యంత్రాంగం ఎవరికోసం పనిచేస్తున్నారని అయన ప్రశ్నించారు. సంబంధిత రెవెన్యూ అధికారులు వెంటనే పాత కడప దళిత రైతుల భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు. లేని పక్షాన రానున్న రోజుల్లో పోరాటాలను నిర్వహిస్తామని అంతవరకు ఈ దీక్షలను విరమించేది లేదని తేల్చి చెప్పారు. దీక్షలలో కూర్చున్న వారు దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం గౌరవ అధ్యక్షులు మడగలం ప్రసాద్, భూమి హక్కుదారులు, ఓబులేసు, చంటి, వీర సుబ్బయ్య, ఓబులేసు వెంకటసుబ్బయ్య, ఓబుళమ్మ, పాలమ్మా, వెంకట సుబ్బమ్మ, నాయకులు ఆర్ సి పి నగర కార్యదర్శి మక్బుల్ భాష, డి జి హెచ్ పిఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, తస్లిమ్ గంగన్న తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**బద్వేలు పెన్ పవర్ జూన్ 16 :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు రాకుండా ఉంటాయని సిద్ధవటం సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం ఒంటిమిట్ట మండలం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మలేరియా వ్యతిరేక నివారణ మాస ఉత్సవాలు గురించి ఒంటిమిట్ట మండలం వైద్యాధికారి డాక్టర్ భావన రెడ్డి మరియు సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల సుబ్బరాయుడు మలేరియా గురించి పాఠశాల యందు పిల్లలకు వివరించడం జరిగింది. మలేరియా దోమ అపరిశుభ్రమైన వాతావరణం లో పెరుగుతుందిదని దీనిని ఆడ అనాఫిలిస్ దోమ అని అంటారు అని అన్నారు ఈ దోమ కుట్టడం వలన చలి జ్వరము తలనొప్పి ఒళ్ళు నొప్పులు వస్తాయి అని ఈ దోమ రాత్రిపూట మాత్రమే కుడుతుందని ఇవి మనుషుల వాసన పసి కడతాయని ఇవి మనుషుల రక్తం త్రాగి జీవిస్తాయని వీటికి చిన్న పెద్ద పేద గొప్ప అనే తారతమ్యం ఉండదని, ఈ దోమలు మనుషులను కుడితే ప్రమాదమని మరి చిన్నపిల్లలకు గర్భవతులకు కుడితే చాలా ప్రమాదమనీ కనుక మన పరిసరాలు పరిశు



భ్రంగా ఉంచుకోవడం వలన మన ఇంటి చుట్టూ మరియు మన పరిసరాలు చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం వలన ఈ మలేరియా నుండి చాలా వరకు మనల్ని మనము కాపాడుకో గలుగుతాము అని తెలియజేశారు దోమల వలన మలేరియా డెంగ్యూ చికెను గున్యా బోదకాలు లాంటి జ్వరాలు వస్తాయి కనుక మీరంతా మీ పాఠశాల లోఎక్కడైనా నీటి నిలువలు ఉంటే మరియు పాఠశాల ఆవరణంలో అపరిశుభ్రంగా ఉంటే మీరంతా కలిసికట్టుగా పాఠశాలపరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి మరియు భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి వేడిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి తెలియజేశారు, ఇప్పుడు వాతావరణ మార్పుల కారణంగా విరేచనాలు వాంతులు అయ్యే అవకాశాలు ఉన్నందున మీరంతా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి అనిమరియు కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలి అని పిల్లలకు ఆరోగ్య సలహాలు ఇవ్వడం జరిగింది ఇందులో భాగంగా మధ్యాహ్నం భోజనాన్ని పరీశీలించడం జరిగింది అక్కడ వంట చేసే వారికి మీరు చేతులు శుభ్రంగా కడుక్కొని వంట చేయాలి అనిచేతికి గోళ్లు లేకుండా చూసుకోవాలి మీరంతా శుభ్రంగా వంట చేసి పిల్లలకు పెట్టాలి మీరు ఈ జాగ్రత్తలు పాటించడం వలన పిల్లలకు ఆహారం వలన అనారోగ్య సమస్యలు రాకుండా ఉంటాయి అని అక్కడ పిల్లలకు మరియు వంట చేసేవారికి ఆరోగ్య సలహాలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్స్ మహబూబ్ బాషా లక్ష్మీనరసమ్మ ఏఎన్ఎం ఆశా వర్కర్లు మరియు పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుడు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే, కలెక్టర్





**అనంతపురం, పెన్ పవర్ జూన్ 16 :** యాడికి మండల కేంద్రంలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.అస్మిత్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తిప్పేనాయక్, మల్లికార్జున, రామ్మోహన్, గుంతకల్లు ఆర్డీవో ఏబివిఎన్ శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 461 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బదిలీ అయిన జిల్లా అధికారులు, ఇతర అధికారులు వెంటనే వారి స్థానాలకు వెళ్లి జాయిన్ కావాలన్నారు. సచివాలయ సిబ్బంది బదిలీల గైడ్లైన్స్ కూడా రావడం జరిగిందన్నారు. ఒక జిల్లా అధికారి సొంత జిల్లాలో ఉండకూడదని, వీఆర్వో, జూనియర్ అసిస్టెంట్, గ్రామస్థాయి అధికారి తన సొంత గ్రామంలో ఉండరాదని, సచివాలయ సిబ్బందికి తన సొంత మండలంలో ఉండరాదని ఆదేశాలు వచ్చాయన్నారు. సీనియర్ అసిస్టెంట్లు తమ సొంత మండలాల్లో ఉండరాదని, ఫస్ట్ లెవెల్ గెజిటెడ్ ఆఫీసర్, డిప్యూటీ తహసీల్దార్, గ్రీనింక్ వాడే అధికారులు, గెజిటెడ్ అధికారుల సంతకాలు, సర్టిఫికెట్లు ఇచ్చేవారు తమ అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండరాదని, సెకండ్ లెవెల్ గెజిటెడ్ అధికారులు వారి సొంత రెవెన్యూ డివిజన్లలో ఉండరాదన్నారు.

జిల్లా అధికారి వారి సొంత జిల్లాలో ఉండకుండా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని, దాని ప్రకారం చేయడం జరిగిందని, ఇందులో ఏవైనా సమస్యలు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని సరిచేసి పరిష్కరిస్తామన్నారు. బదిలీ అయిన వారు వెంటనే వారి స్థానాలకు వెళ్లి జాయిన్ కావాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎంతో చిత్తశుద్ధి చూపించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పడం జరిగిందన్నారు. ఖచ్చితంగా జిల్లాలో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహసిల్దార్లు, ఇతర అధికారులు ఎలా పిజిఆర్ఎస్ అర్జీలను పరిష్కారం చేస్తున్నారు అనేది చూస్తున్నారని, ఇప్పటివరకు అధికారులకు అన్ని విధాల శిక్షణ, నిబంధనలు ఇవ్వడం జరిగిందని, ఇప్పుడు నమూనా ధ్రువీకరణలు (శాంపుల్ వెరిఫికేషన్స్) ఉంటాయన్నారు.

యాదృచ్ఛికంగా ఒక మండలాన్ని తీసుకుంటామని, అక్కడ తనిఖీలు చేస్తామన్నారు. గత రెండు మూడు వారాల్లో రెవెన్యూ శాఖలో ధ్రువీకరణలు చేశామని, ఇప్పుడు జిల్లా అధికారుల పరిధిలో పరిశీలనలు ఉంటాయన్నారు. వివిధ శాఖల పరిధిలో తాము తనిఖీలు చేయాలనుకుంటున్నామని, పెన్షన్లకు సంబంధించి సచివాలయ సిబ్బంది ఆలోచించి, విశ్లేషించి సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. జిల్లా అధికారులు ఈ విషయమై అవగాహనతో ఉండాలని, యాదృచ్ఛికంగా ఒక రోజు ఆయా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ అర్జీదారులకు ఫోన్ చేసి మాట్లాడడం జరుగుతుందని, పిజిఆర్ఎస్ పోర్టల్ లో మీరు ఇచ్చిన ఎండార్స్మెంట్ ని స్టడీ చేసి మీకు ఫోన్ చేసే ముందు అర్జీదారుడితో మాట్లాడతామని, అధికారులు అర్జీలను శ్రద్ధతో, నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను ఎలా పరిష్కరించాలనే విషయమై క్షేత్రస్థాయి అధికారులకు సరైన అవగాహన ఉండాలన్నారు. ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ రామసుబ్బయ్య, డిపిఓ నాగరాజు నాయుడు, డ్వామా పిడి సలిం భాష, డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప, హౌసింగ్ పిడి శైలజ, డిఎల్డిఓ విజయలక్ష్మి, సర్వే ఏడి రూప్ల నాయక్, డిటిడబ్ల్యుఓ రామాంజనేయులు, డివిఈవో వెంకటరమణనాయక్, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, డిఆర్డీఏ పిడి శైలజ, డిసిఓ అరుణకుమారి, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్ యాదవ్, పశుసంవర్ధక శాఖ జెడి వెంకటస్వామి, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్, డిఎస్ఓ వెంకటేశ్వర్లు, పిజిఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, ఆయా శాఖల జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లికి వందనంతో ప్రతి ఇంటా సంతోషం

### మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు.. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

### క్యాంప్ కార్యాలయంలో ఇవాళ సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అనంతపురం, పెన్ పవర్ జూన్ 16 :** తల్లికి వందనం పథకం అమలుతో ప్రతి ఇంటా సంతోషం కనిపిస్తోందని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మొత్తం 33 మంది లబ్ధిదారులకు 45 లక్షల 50 వేల రూపాయలు చెక్కులు అందజేశారు. చెక్కులు అందుకున్న వారు ఎమ్మెల్యేకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ కేవలం ఏడాది వ్యవధిలో 130 మందికి కోటి 70 లక్షల రూపాయలు వరకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద సాయం అందించామని తెలిపారు. ప్రస్తుతం తల్లికి వందనం పథకం కింద ప్రతి ఇంట ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ 15వేల రూపాయలు చొప్పున సాయమందుతోందన్నారు. ఏ ఇంట చూసినా ఆనందం కనిపిస్తోందని అన్నారు. ఇంత డబ్బు వస్తుందని ఊహించలేదని అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని మంత్రి నారా లోకేష్ కి ప్రతి ఒక్కరు కృతజ్ఞతలు చెబుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్లు వంటి హామీలు నెరవేర్చమన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అక్టోబర్ 2 నాటికి డంపింగ్ యార్డులో చెత్త లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. త్వరలో నడిమి వంక ప్రొటెక్షన్ వాల్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి ఇంటికి ఒక ఎంటర్ ప్రెన్యూర్ ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, అర్బన్ నియోజకవర్గంలో త్వరలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ప్రారంభిస్తామని చెప్పారు. రెండు రోజుల క్రితం ఐదు వేల మంది నిరుద్యోగులతో జాబ్ మేళా నిర్వహించి 1450 మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. ఇంకా నాలుగేళ్ల సమయం ఉందని అర్బన్ నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఏపీని ప్రపంచంలోనే నెంబర్-1గా నిలబెడుతామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పట్టాలు తయారు చేస్తే కఠిన చర్యలు : తహసిల్దార్ త్రిభువన్ రెడ్డి



**గోపవరం పెన్ పవర్ జూన్ 16 :** నకిలీ పట్టాల విషయంలో కఠిన చర్యలు చేపట్టేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని గోపవరం తాసిల్దార్ త్రిభువన్ రెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవైనా సమస్యలు విలేకరుల దృష్టికి వస్తే సంబంధిత అధికారుల వివరణతో వార్తలను రాయాలన్నారు. నిరాధారమైన వార్తలను ప్రచురిస్తే చర్యలు చేపడతామన్నారు.ఇప్పటికే కొన్ని విషయాలలో పరువు నష్టానికి సంబంధించిన కేసును నమోదు చేయించడం జరిగిందన్నారు. బద్వేలు మండలం సిద్ధవటం రోడ్ లోని ఓ గ్రామానికి చెందిన ఇరువురు వ్యక్తులు నిరాధారణ ప్రచురణలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రస్తుతం పిపి కుంట వద్ద నిర్మితమవుతున్న గుడిసెల విషయమై కొంతమంది నిరాధారణ నిందారోపణలను రెవెన్యూ శాఖ మీద రుద్దడం జరిగిందని అది సరైన పద్ధతి కాదన్నారు. కొంత మంది విలేకరులు అధికారులను బ్లాక్ మెయిల్ చేయడం సరైన పద్ధతి కాదన్నారు.అదేవిధంగా వాగులు చెరువు సంబంధించిన భూములు ఆక్రమణకు గురవుతున్న విషయం తెలిసిందే.ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైతే కఠిన చర్యలను చేపడతామన్నారు. అంతేకాకుండా మేము నిర్వహించే ప్రతి కార్యక్రమం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చేస్తున్నామన్నారు. నకిలీ పట్టాలకు సంబంధించిన స్థలాలను ఎవరు కొనుగోలు చేయకూడదన్నారు. అదేవిధంగా తమ కార్యాలయంలో ఎటువంటి ఒరిజినల్ రికార్డులు లేవన్నారు.గతంలో నకిలీ పట్టాల విషయంపై కేసు నమోదైన సమయంలో కొన్ని రికార్డులు ఆర్డీవో కార్యాలయంలో మరికొన్ని రికార్డులు పోలీసుల ఆధ్వర్యంలో ఉన్నాయని తెలిపారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు నాకు లేవన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఎవరి పట్ల తమకు శత్రుత్వం చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు.మా తల్లి వయసులో ఉన్న మహిళలను ఆప్యాయతగా పలకరించడం తప్పుగా భావించకూడదన్నారు. ప్రజలకు ఏర్పడే సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వెంటనే సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. ఇప్పటికే రెవెన్యూ పరంగా ఎన్నో సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. అర్హులైన వారికి ఇంటి పట్టాలను తప్పనిసరిగా అందజేస్తామన్నారు. అయితే గతంలో ప్రభుత్వ స్థలాలలో గృహాల నిర్మించుకొని ఉన్నవారికి ఎటువంటి పరిస్థితుల్లో ఇంటి పట్టాలు ఇవ్వడం కుదరదన్నారు. తాసిల్దార్ కార్యాలయంలో ఎవరిని తక్కువగా చూడాల్సిన అవసరం తమకు లేదన్నారు.ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరికి గౌరవం ఇస్తూనే ఉన్నామన్నారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన డిఐపిఆర్ఓ బాలకొండయ్య

**అనంతపురం పెన్ పవర్ జూన్ 16 :** అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ చాంబర్లో సోమవారం సాయంత్రం గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించిన అనంతపురం నూతన డి.ఐ.పి.ఆర్.ఓ బాల కొండయ్య.





## కడపలో ఇంటీరియర్ డిజైన్ మరియు ఫ్యాషన్ టెక్నాలజీ కాలేజీ





**కడప పెన్ పవర్ జూన్ 16 :** కడప నగరం మాను యూనివర్సిటీ క్యాంపస్ లో సమన కాలేజీ వారి ఆధ్వర్యంలో ఫ్యాషన్ డిజైన్ మరియు ఇంటీరియర్ డిజైన్ సంబందించిన బీ ఎస్సి కోర్సు నాలుగు సంవత్సరాలు (8 సెమిస్టర్స్), డిప్లొమా రెండు సంవత్సరాలు (4 సెమిస్టర్స్), సర్టిఫికెట్ కోర్సు ఒక సంవత్సరం (2 సెమిస్టర్స్), ప్రత్యేకంగా అన్ని రకాల సౌకర్యా లతో నూతన కాలేజీని ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబందించిన పోస్టర్ ను కాలేజీ క్యాంపస్ లో సమన కాలేజీ డైరెక్టర్ శ్రీ మహమ్మద్ ఇమ్రాన్ మరియు కాలేజ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ డాక్టర్. ఐ. శివా నాయక్ ఆవిష్కరించారు. ఇటువంటి కాలేజీలు గతంలో కేవలం పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైనవి. ఇప్పుడు ఈ సంవత్సరం నుంచే కడప జిల్లా లో మొదటి సారిగా ఇటువంటి కాలేజీలు రావడం వలన ఉన్నత ఆశయాలతో కొత్తగా టెక్నాలజీ పొందాలని కోరుకొనే విద్యార్థిని విద్యార్థులకు ఇది ఒక గొప్ప అవకాశం గా భావించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కాలేజీ లో చదువుకుంటూ వృతి పరమైన సంపాదన కూడా చేసుకోవచ్చు. అదేవిదంగా సెంట్రల్ గవర్నమెంట్ వారి స్కిల్ బేసడ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కూడా ఏర్పాటు చేసి కచ్చితంగా ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించే భాద్యత యాజమాన్యం వారు తీసుకుంటారని, హైదరాబాద్, బెంగుళూరు, విశాఖపట్నం, ఢిల్లీ లాంటి పెద్ద నగరాలలో కూడా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కాలేజీ లో హాస్టల్ సౌకర్యం మరియు నగరంలో నుంచి వచ్చే వారికి ప్రత్యేక బస్సు సౌకర్యం కూడా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలేజీ పిఆర్ఓ జగన్ రాథోడ్, రిసెప్షనిస్ట్ జాహ్నవి, తదితరులు పాల్గొన్నారు.

## జాయింట్ కలెక్టర్‌కి హార్ట్ ఫుల్ నెస్ పుస్తకాలు అందజేత

### శ్రీరామచంద్ర మిషన్ పుస్తకాలు అందజేత...









**కడప పెన్ పవర్ జూన్ 16 :** శ్రీరామచంద్ర మిషన్ హార్ట్ వారి ఆధ్యాత్మిక త్రైమాసిక హార్ట్ ఫుల్ నెస్ పుస్తకాలను కడప జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు సమ్మి రెడ్డి కృష్ణారెడ్డి, చందన్ కుమార్ అందజేశారు. సోమవారం కడప నగరంలోని కలెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌ను కలిసి శ్రీరామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించే మెడిటేషన్ (ధ్యానం) విశిష్టతను తెలిపారు. అలాగే నగరపాలక కమిషనర్ మనోజ్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ రాకేష్, జిల్లా విద్యాశాఖాధికారి శంషుద్దీన్‌లకు త్రైమాసిక ఆధ్యాత్మిక పుస్తకాలను అందజేశారు.

## రాష్ట్రంలో సంక్షేమం,అభివృద్ధి నిల్లు, డైవర్షన్ పాలిటిక్స్ ఫుల్

### - మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య





**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, జూన్ 16 :** కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం అభివృద్ధి నిల్లు, డైవర్షన్ పాలిటిక్స్ ఫుల్లు అని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం నాయుడుపేట పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీ ప్రజలను వెన్నుపోటు పొడిచి ఏడాది పూర్తయింది అన్నారు. ఓటమి ప్రభుత్వ ఏడాదిపాలన వైఫల్యాలపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రూపొందించిన వెన్నుపోటు పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రారంభించారు. 2019 ఎన్నికల్లో తమ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి జగన్ అంటే నమ్మకం అనే భరోసా కలిగించారని తెలియజేశారు. సూపర్ సిక్స్ పథకాల్లో పింఛన్ పంపిణీ తప్ప ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయలేని చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఐదేళ్ల తమ పాలనలో రాజకీయాలకు అతీతంగా అవినీతికి చోటు లేకుండా వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ 2.81 కోట్ల రూపాయలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించారని తెలియజేశారు. ప్రజా వ్యతిరేక పాలనను నిరసిస్తూ ప్రజల సమస్యలపై గళం ఎత్తుతున్న వైసిపి నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో ఉన్న అతామ ప్రజల పక్షంగానే పనిచేస్తామని తెలియజేశారు. ఏడాది కూటమి పాలన విధ్వంశాలను ప్రజలకు తెలియజేయడం కోసం వెన్నుపోటు పుస్తకాన్ని విడుదల చేశామని తెలియజేశారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలో గుణపాఠం చెప్పి తీరుతారని ఆయన తెలియజేశారు. రాష్ట్రంలో రెడ్బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అందించిన బంగారు భవిష్యత్తును గుర్తు చేసుకుంటున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి,వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి,మాజీ ఎఎంసి చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి,వైసీపీ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి,నాయుడుపేట మండలం వైసిపి అధ్యక్షులు ఒట్టూరు కిషోర్ యాదవ్,నాయుడుపేట పట్టణ పార్టీ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, నాయుడు పేట ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి, సూళ్లూరుపేట ఎంపీపీ అనిల్ రెడ్డి, పెళ్లకూరు ఎంపీపీ శేఖర్ రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి,వైసీపీ సూళ్లూరుపేట నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు కట్టా భవాని శంకర్ రెడ్డి,సూళ్లూరుపేట నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్ళీ జగన్ టూర్...ఏం జరగబోతోంది ?



**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ వారం రోజుల వ్యవధిలోనే మరోసారి పర్యటనకు వస్తున్నారు. ఆయన ఈ నెల 11న ప్రకాశం జిల్లా పొదిలిలో పర్యటించారు. అయితే ఆ టూర్ లో ఘర్షణలు చోటు చేసుకున్నాయి. మహిళలు, పోలీసుల మీద రాళ్ళు రువ్వారని వైసీపీ నేతల మీద కేసులు పెట్టారు. ఇక దాని మీద సీఎం చంద్రబాబు అయితే జగన్ మీద ఒక స్థాయిలో ఫైర్ అయ్యారు. జగన్ పర్యటనలకు అనుమతి ఇస్తుంటే అలజడులకు వైసీపీ సిద్ధమవుతోందని మండిపడ్డారు. ఈ విషయం ఇలా ఉండగానే జగన్ పల్నాడు జిల్లా రెంటపాళ్ళ పర్యటనకు వస్తున్నారు. పోలీసుల వేధింపుల వల్ల వైసీపీ నాయకుడు నాగ మల్లేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్నారు. దాంతో ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ సిద్ధమయ్యారు. అయితే ఈసారి జగన్ పర్యటనకు పోలీసులు ఆంక్షలు బాగా పెట్టారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. జగన్ పర్యటనలో ఎన్ని వాహనాలు ఉంటాయి, ఎంత మంది జనాలు పాల్గొంటారు అన్న దాని మీద పోలీసులు వాకబు కోసం వైసీపీ నేతలకు నోటీసులు జారీ చేశారు.జగన్ టూర్ లో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని అనుమానం ఉంటే ఆ పర్యటనను ఏ సమయంలోనైనా రద్దు చేయగలమని పోలీసులు ఆ నోటీసులో పేర్కొన్నారు. అంతే కాదు జగన్ పర్యటన షెడ్యూల్ ను ఏ పరిస్థితుల్లో అయినా సవరించే అవకాశం అధికారం తమకు ఉందని పోలీసులు పేర్కొన్నట్లుగా వైసీపీ నేతలు చెబుతున్నారు.దీని మీద వైసీపీ నేతలు ఫైర్ అవుతున్నారు. తమ నాయకుడి పర్యటనలకు వస్తున్న ఆదరణ చూసి ఈ విధంగా షరతులు పెడుతున్నారు అని అంటున్నారు. ఇక గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు అయితే చంద్రబాబు ప్రభుత్వం మీద ఫైర్ అయ్యారు.పోలీసుల ద్వారా జగన్ పర్యటనలను అడ్డుకోవాలని చూస్తున్నారు అని ఆయన విమర్శించారు. తమ పార్టీ నేత చనిపోతే ఆ కుటుంబాన్ని పరామర్శించవద్దా అని ఆయన ప్రశ్నించారు. జగన్ పర్యటనలో హింస సృష్టించేందుకు టీడీపీ వారు చూస్తున్నారు అని ఆయన ఆరోపించారు. జనాలను వారే పెట్టించి కోడి గుడ్లు జగన్ మీద వేయిస్తారు అని సంచలన ఆరోపణలు చేశారు.ఈ తరహా బెదిరింపులకు తాము భయపడేది లేదని ఆయన స్పష్టం చేస్తున్నారు. తమ అధినేత పర్యటన విజయవంతం చేస్తామని అంటున్నారు. అయితే జగన్ పొదిలి టూర్ లో చోటు చేసుకున్న ఘర్షణలు పెద్ద ఎత్తున చర్చకు ఆస్కారం ఇచ్చాయి. ఎవరు ఎవరిని రెచ్చగొట్టారో తెలియదు కానీ ఘర్షణ అయితే జరిగింది. మరి ఇపుడు కూడా అలాంటి సన్నివేశాలు రిపీట్ అవుతాయా లేక అవకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకుంటారా అన్న డిస్కషన్ సాగుతోంది. మరో వైపు చూస్తే జనాల ముసుగులో టీడీపీ వారే అలజడులు సృష్టిస్తారు అని వైసీపీ నేతలు అనుమానిస్తున్నారు. తమ పార్టీకి ప్రజాస్వామ్యంగా ఉన్న హక్కులను వాడుకుంటూ పర్యటనలు చేసుకోకూడదా అని ప్రశ్నిస్తున్నారు. జగన్ పర్యటనలకు ఆటంకాలు సృష్టిస్తూ అసలు ఆయన బయటకు రాకుండా చూసేందుకే ఇలాంటివి చేస్తున్నారని షరతులు పెడుతున్నారని మండిపడుతున్నారు. ఇవన్నీ సరే కానీ ఈ నెల 18న జగన్ రెంటపాళ్ళ పర్యటన ఎలా సాగుతుంది అన్నదే ఇపుడు అందరిలో ఆసక్తిగా మారింది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## ఇదే అసలు రహస్యం... ఇరాన్ పై సడన్ గా యుద్ధం ఎందుకో తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఓవైపు అమెరికాతో ఇరాన్ కు అణు చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ఆదివారం (జూన్ 15)న ఆరో విడత చర్చలు జరగాల్సి ఉంది. ఈ సమయంలో ఈ చర్చలపై ఒక క్లారిటీ రావొచ్చనే ప్రచారమూ జరుగుతోంది. ఈ సమయంలో గురువారం రాత్రి (జూన్ 12)న ఇరాన్ లోని అణుస్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం ఒక్కసారిగా విరుచుకుపడింది. ఇరాన్ పై క్షిపణుల వర్షం కురిపించింది.

ఈ క్రమంలో టెహ్రాన్ లోని ఇరాన్ న్యూక్లియర్ వెపన్స్ ప్రాజెక్ట్ పైనా ఇరాన్ కు చెందిన మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ హెడ్ క్వార్టర్స్ పైనా మిస్సైళ్లతో విరుచుకుపడింది. అయితే.. ఓ వైపు అమెరికాతో ఇదే అణ్వాయుధాలపై చర్చలు జరుగుతున్న వేళ.. ఇజ్రాయెల్ సడన్ గా ఈ రేంజ్ లో ఎందుకు ఇరాన్ పై విరుచుకుపడింది? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అయితే.. తాజాగా దానికి సమాధానం వచ్చేసింది.అవును... అమెరికాతో అణు చర్చలు జరుగుతున్న వేళ ఇరాన్ పై ఇజ్రాయెల్ విరుచుకుపడటానికి గల కారణం తెలిసింది. అందుకు గల కారణం.. ఇరాన్ న్యూక్లియర్ బాంబులకు సంబంధించిన డిజైన్ ప్రాసెస్ కు సంబంధించి అత్యంత కీలక ప్రయోగం చేసిందనే గోల్డెన్ ఇన్ఫర్మేషన్.. టెల్ అవీవ్ కు అందిందంట. దీంతో.. టెహ్రాన్ తలచుకుంటే కొన్ని వారాల్లోనే అణుబాంబులను రూపొందించగలదని ఇజ్రాయెల్ ఓ నిర్ధారణకు వచ్చిందంట.ఇదే సమయంలో... ఆయుధ శ్రేణి యురేనియం నుంచి ఓ పేలుడు పరికరాన్ని తయారుచేసేందుకు పలు వర్కింగ్ గ్రూప్ లను ఇరాన్ ఏర్పాటుచేసిందని సమాచారం అందిందంట! దీంతో.. ఇక ఏమాత్రం ఆలస్యం చేసినా తమ అస్తిత్వానికి ముప్పు వాటిల్లుతుందని గ్రహించిన ఇజ్రాయెల్... మరో ఆలోచన లేకుండా ఇరాన్ లోని అణు స్థావరాలే లక్ష్యంగా విరుచుకుపడిందని "టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్" కథనంలో పేర్కొంది.దీనికి తోడు పౌర అవసరాలకు మించి యురేనియంను ఇరాన్ శుద్ధి చేస్తూనే ఉందట. ఇదే సమయంలో.. అటామిక్ ఎనర్జీ సంస్థ గత నెలలో ఇచ్చిన నివేదిక ప్రకారం.. ప్రస్తుతం ఇరాన్ వద్ద ఉన్న యురేనియం మరింత శుద్ధి చేస్తే 9 అణుబాంబుల తయారీకి సరిపోతుందని పేర్కొంది. దీంతో.. ఇజ్రాయెల్ తన తొలిదాడిలోనే అనుభవజ్ఞులైన సుమారు ఆరుగురు ఇరాన్ అణు శాస్త్రవేత్తలను అంతం చేసింది.దీనికి అవసరమైన ఆయుధాలను ఇజ్రాయెల్ కోవర్టు బలగాలు ట్రక్కులు, కంటైనర్లు, సూట్ కేసుల్లో ఇరాన్ లోకి చేర్చారట. అనంతరం.. వీటిని ఇజ్రాయెల్ గూఢచార వ్యవస్థ మొస్సాద్ ఏజెంట్లు సమీకరించి.. అవసరమైన బలగాలకు చేర్చాయి. దీంతో.. గురువరం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇజ్రాయెల్ శ్రేణులు ఇరాన్ పై దాడులు చేశాయి. ఇవి ప్రధానంగా ఇరాన్ అణుశాస్త్రవేత్తలు, ఇరాన్ టాప్ మిలటరీ జనరల్ ను లక్ష్యంగా చేసుకున్నాయి.వాస్తవానికి ఎలాంటి యుద్ధ సంకేతాలు వీరికి వచ్చినా వీరంతా.. దాడులను తట్టుకునే షెల్టర్స్ లోనే నివాసం ఉండేవారు. అయితే.. ఓ పక్క అమెరికాతో తమకు అణు చర్చలు జరుగుతున్నందు వల్ల ఇజ్రాయెల్ దాడులు చేసే అవకాశం లేదని వీరంతా భావించారంట. దీంతో... వీరంతా ప్రైవేట్ హౌసెస్ లో బస చేశారు. ఆ విషయం తెలుసుకున్న ఇజ్రాయెల్.. వారు నివాసమున్న అపార్ట్ మెంట్ లోని ఫ్లాట్ పై నేరుగా దాడి చేశాయి.

## ఏఐ సాయంతో అంధులకు చూపు ఇచ్చిన యూపీ యువకుడు.. ప్రపంచం ఫిదా!

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ విస్తృతంగా విస్తరిస్తోంది. వైద్యశాఖ నుంచి విద్యారంగం వరకు ఎన్నో సేవలలో ఏఐ కీలకపాత్ర పోషిస్తోంది. అయితే ఉత్తరప్రదేశ్‌కు చెందిన మునీర్ ఖాన్ అనే యువకుడు ఏఐ సాయంతో మానవ సేవలో ఓ గొప్ప చరిత్ర సృష్టించాడు.

**'విజన్ ప్రో' స్మార్ట్ గ్లాసెస్ ఆవిష్కరణ**

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లఖింపుర్ ఖేరీ అనే చిన్న గ్రామానికి చెందిన మునీర్ ఖాన్, ఏఐ టెక్నాలజీని పూర్తిగా నేర్చుకుని, అంధుల కోసం ప్రత్యేకంగా 'విజన్ ప్రో' అనే స్మార్ట్ గ్లాసెస్‌ను అభివృద్ధి చేశాడు. ఈ గ్లాసెస్ సాయంతో అంధులు కేవలం పరిసరాలను మాత్రమే గుర్తించగలరు కాకుండా, పుస్తకాల్లో ఉన్న సమాచారం కూడా టెక్స్ట్ టు స్పీచ్ సాంకేతికత ద్వారా వినగలుగుతున్నారు.

**ఆబ్జెక్ట్ రికగ్నిషన్ టెక్నాలజీతో నూతన ఆశలు**

ఈ గ్లాసెస్‌లో ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన ఆబ్జెక్ట్ రికగ్నిషన్ టెక్నాలజీ అమర్చారు. ఇది ముందు ఉన్న వస్తువులను గుర్తించి, దాని వివరాలను వినిపించగలదు. అంతేకాక ట్రాఫిక్ లైట్స్‌ను చదవడం, వాయిస్ కంట్రోల్‌తో పనులను నిర్వహించడం వంటి ఫీచర్లు ఈ గ్లాసెస్‌లో ఉన్నాయి. దాంతో అంధులు స్వేచ్ఛగా బయటకి వెళ్లి, రహదారి దాటి, పుస్తకాలు చదవడం వంటి పనులు సులభంగా చేయగలుగుతున్నారు.

**విద్యా నేపథ్యం - అంతర్జాతీయ గుర్తింపు**

ఈ ప్రాజెక్టుకు 'విజన్ ప్రో' అనే పేరుపెట్టిన మునీర్ ఖాన్, తన




విద్యాభ్యాసాన్ని నైనిటాల్‌లోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్‌లో పూర్తి చేశాడు. అనంతరం దేశంలోని వివిధ ఐఐటీల్లో ఏఐపై షార్ట్ టర్మ్ కోర్సులు చేశాడు. అలాగే అనేక వర్క్‌షాప్‌లకు హాజరై టెక్నాలజీలో దిట్టగా మారాడు.

ఆయన కృషికి గుర్తింపు లభించి న్యూయార్క్‌లోని ప్రముఖ సంస్థ 'హ్యూమానిటీ ఫౌండేషన్' నుంచి ప్రతిష్టాత్మక గ్లోబల్ అవార్డు వరించింది. మునీర్ చేసిన ఈ ఆవిష్కరణ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. "ఈ గ్లాసెస్ అంధుల జీవితాన్ని పూర్తిగా మార్చివేస్తుంది. వారు ఇక పరాధీనులు కారు. స్వతంత్రంగా బతకగలుగుతారు" అని మునీర్ ఖాన్ గర్వంగా చెబుతున్నాడు.

మునీర్ ఖాన్ ఈ విజయంతో నిరూపించాడు ఏఐ సాంకేతికతను మంచి పనులకు ఉపయోగిస్తే, అది లక్షల మందికి వెలుగు నింపగలదని! ఇప్పుడు అందరూ అతడిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

## భయంతో చావుల అంచుల వరకూ.. భారతీయ విద్యార్థుల కోసం కేంద్రం సంచలన నిర్ణయం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో అక్కడ నివసిస్తున్న భారతీయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులతో టెహ్రాన్, ఇతర ప్రాంతాల్లో భయాందోళన వాతావరణం నెలకొంది. శబ్దాలు, పేలుళ్ల మధ్య కాలం గడుపుతూ తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఉన్నామని భారతీయులు చెబుతున్నారు.ప్రస్తుతం ఇరాన్‌లో సుమారు 10,000 మంది భారతీయులు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది విద్యార్థులు, ఉపాధి కోసం వెళ్లిన కార్మికులు ఉన్నారు. అక్కడి పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం ఈ భారతీయులను స్వదేశానికి తరలించే ప్రత్యేక ఆపరేషన్‌ను సిద్ధం చేస్తోంది. దీనికి సంబంధించి త్వరలో పేరును ఖరారు చేయనున్నారు. అయితే గగనతల ప్రయాణంపై పరిమితులు ఉన్న నేపథ్యంలో భూసరిహద్దుల మీదుగా తరలించే అవకాశాలు ఉన్నట్టు ఇరాన్ విదేశాంగ శాఖ తెలిపింది.ఇరాన్‌లో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థి ఇంతిసాల్ మొహిదీన్ మాట్లాడుతూ "విమాన దాడుల శబ్దాలతో నిద్ర మానేశాం. రోజూ పేలుడు శబ్దాల మధ్య గడుపుతున్నాం. కాలేజీ బేస్‌మెంట్‌లో కాలం తీయాల్సి వస్తోంది. టెహ్రాన్‌లోని మా యూనివర్శిటీలో దాదాపు 350



మంది భారతీయ విద్యార్థులు ఉన్నారు. మనం ఎప్పుడు స్వదేశానికి వెళ్లగలమో అనిపిస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశాడు.ఈ పరిస్థితిపై భారత విదేశాంగ శాఖద స్పందించింది. టెహ్రాన్‌లోని భారత ఎంబసీ నిరంతరం పరిస్థితిని గమనిస్తూ, అవసరమైన చర్యలు తీసుకుంటోందని తెలిపింది. ఇప్పటికే కొంతమంది విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించామని పేర్కొంది. మిగిలినవారి కోసం కూడా చర్యలు కొనసాగుతున్నాయని స్పష్టం చేసింది

.భారతీయులంతా సురక్షితంగా ఉండేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యత్నాలు చేస్తుండటం కొంత భరోసానిస్తుండగా, అక్కడి భారతీయులు త్వరితగతిన తాము స్వదేశానికి చేరాలన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

## కేటీఆర్ అరెస్ట్ మీద స్పందించిన ఎమ్మెల్సీ కవిత!



**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై జరుగుతున్న ఏసీబీ విచారణపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. ఈ కేసును కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రాజకీయ ప్రతీకార చర్యగా ఆమె అభివర్ణించారు. ప్రజల దృష్టిని ప్రధాన సమస్యల నుండి మరల్చడానికే ఇలాంటి విచారణలు ప్రారంభించారని ఆమె ఆరోపించారు.కవిత మాట్లాడుతూ.. "ప్రతి పార్టీకి లోపాలు ఉంటాయి. వాటిని అధినేతకు తెలియజెప్పడం సహజం. కానీ దాన్నే పెద్ద దోషంగా చిత్రీకరించడం తగదు. మా పార్టీలో లోపాలుంటే వాటిని సరిదిద్దుకునే శక్తి మాలో ఉంది. కానీ మాపై ఎవరు దాడి చేస్తే చూస్తూ ఊరుకోం. రాజకీయంగా ఎదురుదెబ్బ తీయడానికి కాంగ్రెస్ సర్కారు విచారణల పేరుతో వేధింపులు చేస్తోంది" అని వ్యాఖ్యానించారు.

**కేటీఆర్, బీఆర్ఎస్ పై కవిత మనసు మారిందా?**

కేసీఆర్ కు ఇటీవల అసంతృప్తి లేఖ రాసి బీఆర్ఎస్ లో కలకలం రేపింది కవిత. ఇందులో కేటీఆర్ తోపాటు కొంతమందిపై విమర్శలు చేసింది. బీఆర్ఎస్ లో దెయ్యాలు ఉన్నాయని ఆరోపించింది. ఇప్పుడు పాత పగలన్నీ మాని కేటీఆర్ కు మద్దతుగా మాట్లాడడంతో ఇక కవిత అసమ్మతి, అసంతృప్తి ముగిసినట్టేనని తెలుస్తోంది.

**కాంగ్రెస్ హామీలపై కవిత విమర్శలు**

ఇక కాంగ్రెస్ హామీలపై ఆమె తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు రైతులకు, మహిళలకు, వృద్ధులకు పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఒక్కటీ నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. "రైతు భరోసా పేరుతో ఇప్పటివరకు 60 శాతం రైతులకే మద్దతిచ్చారు. మిగిలిన 40 శాతం రైతులు ఎప్పుడు నిధులు పొందబోతున్నారో చెప్పాలి. మహిళలకు వాగ్దానం చేసిన రూ.2500 ఇవ్వలేదు. వృద్ధులకు పింఛన్లు పెంచలేదు. ఇలా అన్ని హామీలను విస్మరించి, మోసం చేసి ప్రజలను కంగారు పెడుతున్నారు" అని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

**"ఎంత వేధింపులకు పాల్పడ్డా భయపడేది లేదు"**

కవిత తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. "మా పార్టీ అధినేత కేసీఆర్‌ను కాళేశ్వరం కమిషన్ పేరుతో విచారించారు. ఇప్పుడు కేటీఆర్‌ను ఏసీబీ విచారిస్తోంది. ఇది స్పష్టమైన రాజకీయ పగ. మా నాయకులను, కార్యకర్తలను ఇళ్ల నుంచి రాకుండా అడ్డుకోవడం దారుణం. తెలంగాణ భవన్ తాళం వేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. మేము ఈ దాడులను ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నాం. ఎవరు ఎంత వేధింపులకు పాల్పడ్డా భయపడేది లేదు. మేము లోపాలను సరిదిద్దుకుంటాం. కానీ దాడులకు మాత్రం సమాధానం చెబుతాం" అని ఆమె స్పష్టం చేశారు.

ఈ పరిణామాలతో తెలంగాణ రాజకీయాల్లో ఉద్రిక్తత మళ్లీ పెరిగింది. బీఆర్ఎస్ - కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం మరింత తీవ్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ విచారణలు, రాజకీయ విమర్శలు ఎలాంటి మలుపులు తీసుకుంటాయో వేచి చూడాలి.

## టెల్ అవీవ్ కు కొత్త బలం... ఇజ్రాయెల్ టు ఇరాన్ వయా సిరియా!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా బాంబుల మోతతో దద్దరిల్లిపోతోంది. ఎవరికి వారు ఏమాత్రం తగ్గకుండా దాడులకు తెగబడుతున్నారు. ఈ క్రమంలో ఏ లక్ష్యంతో అయితే యుద్ధం ప్రారంభించిందో.. ఇజ్రాయెల్ ఆ పని దాదాపు పూర్తి చేసిందని అంటున్నారు. ఇందులో భాగంగా.. ఇరాన్లోని అణు స్థావరాలతో పాటు అణు శాస్త్రవేత్తలను మట్టుబెట్టింది.ఈ సందర్భంగా స్పందించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్).. ఇరాన్ వ్యాప్తంగా సుమారు 250 లక్ష్యాలపై దాడులు చేసినట్లు ప్రకటించింది. ఇదే సమయంలో.. వాషింగ్టన్ కు చెందిన ఓ మానవ హక్కుల సంస్థ స్పందిస్తు... ఇప్పటివరకూ జరిగిన దాడుల్లో 406 మంది ఇరాన్ పౌరులు మృతి చెందారని, 654 మందికిపైగా గాయాలపాలయ్యారని పేర్కొంది.ప్రధానంగా... ఇరాన్ ఆర్థిక మూలాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. చమురు, సహజ వాయు క్షేత్రాలపైనే గురిపెట్టింది. ఈ క్రమంలో.. ప్రపంచంలోనే అతి పెద్ద చమురు క్షేత్రమైన 'సౌత్ పార్స్' పైనా దాడి జరిగింది. ఈ నేపథ్యంలో.. ఇరాన్ కు మరింత కష్టాలు తెచ్చే ఓ బ్యాడ్ న్యూస్ తెరపైకి వచ్చింది. ఇజ్రాయెల్ కు బలం పెరుగుతోంది!అవును... ఇప్పటికే టెహ్రాన్ పై టెల్ అవీవ్ నిప్పుల వర్షం కురిపిస్తోన్న వేళ ఇరాన్ కు ఓ బ్యాడ్ న్యూస్ తెరపైకి వచ్చింది. ఇందులో భాగంగా.. ఇరాన్ దాడుల నుంచి ఇజ్రాయెల్ ను రక్షించేందుకు అమెరికా రంగంలోకి దిగింది. ఈ క్రమంలో.. ఇప్పటికే పశ్చిమాసియాలో మొహరించి ఉన్న అమెరికా యుద్ధ నౌకల నుంచి ఆ దేశ ఆయుధ రక్షణ వ్యవస్థలు చురుగ్గా పనిచేస్తూ.. ఇరాన్ క్షిపణులను పేల్చేస్తున్నాయి. ఈ క్రమంలో తాజాగా... యుఎస్ యుద్ధనౌకల్లో ఆర్లీ బర్క్-క్లాస్ డిస్ట్రాయర్లు.. ఇజ్రాయెల్ కు దగ్గరగా, మధ్యధరా సముద్రంలో మోహరించాయి. ఈ నౌకలు ఎస్ఎం-3 వంటి అధునాతన క్షిపణులను కలిగి ఉంటాయి. ఇవి సర్ఫేస్ టు ఎయిర్ క్షిపణులు. వాస్తవానికి ఈ విషయాన్ని ఇరాన్ మొదట నుంచీ ఆరోపిస్తుంది. అయితే.. తాజాగా వాటికి సంబంధించిన సాక్ష్యాలు తెరపైకి వచ్చాయి!ఇలా డిఫెన్స్ విషయంలో ఇజ్రాయెల్ కు అమెరికా సహకరి స్తుండగా.. ఎఫెన్స్ విషయంలో సిరియా సహకరిస్తుందని అంటున్నారు. ఇందులో భాగంగా... ఇజ్రాయెల్ కు మద్దతుగా రంగంలోకి దిగిన సిరియా.. ఇరాన్ కు వ్యతిరేకంగా దాడులకు ప్లాన్ చేస్తోందట. దీంతో.. ఇప్పుడు ఇజ్రాయెల్ జెట్ ఫైటర్లు సిరియా మీదుగానే ఇరాన్ ను టార్గెట్ చేస్తున్నాయని చెబుతున్నారు.

# అలా చేస్తే దిగ్గజాలకు అన్యాయం జరిగినట్టే: పటౌడీ ట్రోఫీ పేరు మార్చడంపై గవాస్కర్ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య శుక్రవారం (జూన్ 20) లీడ్స్ వేదికగా ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. ఛాంపియన్ షిప్ 2025-27 సైకిల్ లో ఇరు జట్లకు ఇదే తొలి సిరీస్. ఒక్క రూట్ తప్పితే ఇరు జట్లలో దాదాపు మొత్తం యంగ్ ప్లేయర్లతోనే నిండిపోయింది. దీంతో ఈ సారి ఈ సిరీస్ కు కొత్త కల రానుంది. ఇండియా, ఇంగ్లండ్ మధ్య జరిగే ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్ ట్రోఫీకి పేరును కూడా మార్చనున్నారు. పటౌడీ ట్రోఫీ పేరు తొలగిస్తూ సచిన్ టెండూల్కర్%-%జేమ్స్ అండర్సన్ పేరు మీద నిర్వహించడం ఖారారైంది. దివంగత పటౌడీ పేరు మార్చడంపై భారత దిగ్గజ క్రికెటర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ పటౌడీ ట్రోఫీ పేరు మార్చవద్దని భారత క్రికెట్ దిగ్గజం, క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ భావిస్తున్నాడట. ఈ మేరకు సచిన్ బీసీసీఐ, ఈసీబీతో మాట్లాడి రిక్వెస్ట్ చేసినట్టు సమాచారం. సచిన్ తో పాటు తాజాగా టీమిండియా దిగ్గజ ఓపెనర్ సునీల్ గవాస్కర్ సైతం పటౌడీ పేరుతో ఉన్న ట్రోఫీని మార్చడానికి వీలు లేదని భావిస్తున్నాడు. మన్సూర్ అలీ ఖాన్ పటౌడి పేరు మీద పెట్టబడిన ఈ ట్రోఫీని రీబ్రాండ్ చేయాలనే నిర్ణయం భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్‌కు నచ్చలేదు. దీనిపై మాట్లాడుతూ, ట్రోఫీని రీబ్రాండ్ చేయడం దివంగత మున్సూర్ అలీ ఖాన్ పటౌడికి అన్యాయం చేసినట్టే అని గవాస్కర్ అభిప్రాయపడ్డారు. భారత క్రికెట్‌కు ఆయన చేసిన కృషిని మర్చిపోకూడదని సూచించారు. గవాస్కర్ మాట్లాడుతూ.. "ఇంగ్లాండ్, భారత్ మధ్య ఇంగ్లాండ్‌లో జరిగిన టెస్ట్ సిరీస్ విజేతలకు ఇచ్చే పటౌడీ ట్రోఫీని ఈసీబీ రద్దు చేయబోతోందనే వార్తలు నిజంగా కలవరపెడుతున్నాయి. వ్యక్తిగత ఆటగాళ్ల రిటైర్మెంట్ తర్వాత వారి పేరుతో ట్రోఫీ పెట్టడం గురించి వినడం ఇదే మొదటిసారి. అయితే ఈ నిర్ణయం పూర్తిగా ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డుదే. బీసీసీఐకి కూడా ఈసీబీ సమాచారం ఇచ్చి ఉండవచ్చు. పేరు మారిస్తే ఇంగ్లాండ్, ఇండియా క్రికెట్‌కు పటౌడీలు చేసిన కృషికి గుర్తింపు లేనట్టే. భవిష్యత్తులో ట్రోఫీ రీబ్రాండింగ్ జరిగే సందర్భాలు లేవని ఆశిస్తున్నా". అని గవాస్కర్ చెప్పుకొచ్చారు.

ఇంగ్లండ్ గడ్డపై భారత్%-%ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగే ద్వైపాక్షిక టెస్టు సిరీస్‌ను 2007 నుంచి మన్సూర్ అలీఖాన్ (ఎంఏకే) పటౌడీ ట్రోఫీ పేరిట నిర్వహించడం జరుగుతోంది. ఇంగ్లండ్-భారత్ మధ్య టెస్టు మ్యాచ్ జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని 2007లో ఈ ట్రోఫీని ఆరంభించారు. ఎంఏకే పటౌడీ 1961 నుంచి 1975 మధ్యకాలంలో భారత జట్టు తరఫున 46 టెస్టులు ఆడారు. 34.91 సగటుతో 2793 పరుగులు చేశాడు. వీటిలో ఆరు సెంచరీలు.. 16 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అతను ఆడిన 46 టెస్టుల్లో 40 టెస్టులు ఇండియా కెప్టెన్ గా చేసాడు. 1967లో న్యూజిలాండ్‌పై భారతదేశం తొలి విదేశీ టెస్ట్ విజయాన్ని సాధించింది. పటౌడీ మొత్తం 310 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు.

# టెంబా అంటే అర్థం ఇదే.. అమ్మమ్మ పెట్టిన పేరుకు న్యాయం చేసిన బవుమా



**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా ప్రస్తుత క్రికెటర్ లో మోస్ట్ ట్రెండింగ్ లో ఉన్నాడు. ఈ సఫారీ కెప్టెన్ మీద సినిమా తీయాలే గానీ బవుమా మీద బయోపిక్ వస్తే బ్లాక్ బస్టర్ అవ్వడం ఖాయం. బవుమా క్రికెట్ కెరీర్ లోనే కాదు జీవితంలో లెక్కలేనన్ని ఎత్తు పల్లాలున్నాయి. అవమానాలు, విమర్శలు, ట్రోలింగ్స్, చిన్న చూపు చూడడం, తక్కువగా చేసి మాట్లాడడం, ఎత్తును కామెంట్ చేయడం, కలర్ పై జోక్ లు వేసుకోవడం లాంటి ఎన్నో బాధాకర సంఘటనలు బవుమా జీవితంలో ఎన్నో ఉన్నాయి. వాటన్నిటికీ సమాధానమిస్తూ తనపై వస్తున్న విమర్శలకు చెక్ పెట్టాడు. తాను అసామాన్యుడు అని నిరూపించాడు. సౌతాఫ్రికా క్రికెట్ లో ఐసీసీ ట్రోఫీ ఒక కల. 1998లో ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ వచ్చినప్పటికీ వరల్డ్ టైటిల్ ఒక్కటి కూడా కొట్టలేకపోయింది. దిగ్గజ క్రికెటర్లు ఎంత ప్రయత్నించినా సౌతాఫ్రికాపై వరల్డ్ టైటిల్ అందని కలగానే మిగిలిపోయింది. అయితే బవుమా రాకతో సౌతాఫ్రికా జట్టు చాలా కొత్తగా కనిపిస్తుంది. ప్రతి ఒక్కరిలో జట్టు కోసం ఏదైనా చేయాలనే కసి కనిపించింది. టెస్ట్ ఛాంపియన్స్ షిప్ ఫైనల్ కు వెళ్లినా అదృష్టవశాత్తు వెళ్లారని.. ఆస్ట్రేలియాపై చిత్తవడం గ్యారంటీ అనుకున్నారు. ఈ దశలో సౌతాఫ్రికా ఆశలను బవుమా నెరవేర్చగలడా అనే ప్రశ్నలకు చెక్ పెట్టి సఫారీలకు టెస్ట్ ఛాంపియన్స్ షిప్ టైటిల్ అందించాడు. సౌతాఫ్రికా దేశం తనపై పెట్టుకున్న ఆశలను బవుమా తీర్చాడు. 27 ఏళ్ళ తర్వాత తమ దేశానికి ఐసీసీ టైటిల్ అందించాడు. అయితే టెంబా అనే పేరుకు ఆశ అర్థం అని బవుమా చెప్పాడు. చిన్న వయసులో తన అమ్మమ్మ తనకు ఎందుకు టెంబా పేరు పెట్టిందో వివరించాడు. బవుమా మాట్లాడుతూ.. మా అమ్మమ్మ నాకు టెంబా అని పేరు పెట్టింది. ఈ పేరుకు అర్థం ఆశ. జాతి, దేశం నాపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని ఆ పేరు పెట్టారు. ఇంతకన్నా ఉత్తమమైన పేరు ఉంటుందా". అని బవుమా తెలిపాడు. సౌతాఫ్రికా ఆశలను నెరవేర్చడమే కాదు.. విమర్శించిన వారే ఇప్పుడు తలలు వంచుకుంటున్నారు. మరో 4 నుంచి 6 ఏళ్ళ పాటు బవుమా గురించి మాట్లాడకుండా చేశాడు.

# టెస్ట్ కెప్టెన్ అవుతానని ముందే తెలిసినా మా నాన్నకు చెప్పలేదు: గిల్ ఎమోషనల్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా యువ సంచలనం శుభమాన్ గిల్ కొత్త బాధ్యతలు స్వీకరించనున్నాడు. రోహిత్ శర్మ తర్వాత భారత టెస్ట్ జట్టును ముందుకు తీసుకువెళ్ళడానికి సిద్ధమవుతున్నాడు. జూన్ 20 నుంచి ఇంగ్లాండ్ తో భారత్ 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ఆడనుంది. ఈ మెగా సిరీస్ గిల్ కు అగ్ని పరీక్షగా మారింది. కెప్టెన్సీతో పాటు బ్యాటింగ్ లోనూ గిల్ రాణించాల్సి ఉంది. ముఖ్యంగా ఇంగ్లాండ్ పిచ్ లపై గిల్ విఫలమవుతాడనే తీవ్ర విమర్శలు ఉన్నాయి. భారత టెస్ట్ కెప్టెన్సీ దక్కడం అత్యున్నత గౌరవం. 25 ఏళ్లకే కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్న గిల్ భారత టెస్ట్ జట్టుకు ఓవరాల్ గా 37 వ కెప్టెన్. ఇంగ్లాండ్ సిరీస్ కు ముందు దినేష్ కార్తీక్ తో కలిసి ఒక ఇంటర్వ్యూలో గిల్ తన అనుభవాలను పంచుకున్నాడు. ఈ ఇంటర్వ్యూ లో ఫాదర్స్ డే సందర్భంగా గిల్ తన తండ్రి గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యాడు. స్కై స్పోర్ట్స్‌లో దినేష్ కార్తీక్‌తో జరిగిన సంభాషణలో గిల్ ఈ విధంగా అన్నాడు. "నిజాయితీగా చెప్పాలంటే, నేను భారత టెస్ట్ కెప్టెన్ అవుతానని నా తండ్రి కలలో ఊహించి ఉండకపోవచ్చు. నేను కూడా ఖచ్చితంగా అనుకోలేదు. మొదట్లో తనకు కెప్టెన్సీ ఇస్తారని తెలిసినా అధికారిక ప్రకటన వచ్చే వరకు నా తండ్రికి చెప్పకుండా రహస్యంగా ఉంచాను. నేను కెప్టెన్ అయిన తర్వాత నా తండ్రి నాకు ఫోన్ చేసి ఎమోషనల్ అయ్యాడు". అని గిల్ అన్నాడు.

జట్టులో ప్రతి ఒక్కరూ భద్రంగా, సంతోషంగా ఉండే సంస్కృతిని తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇండియా టెస్ట్ టీమ్ కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అన్నాడు. మనం సాధించిన విజయాలు, ట్రోఫీలను పక్కనబెడితే జట్టులో అందరూ సురక్షితంగా, సంతోషంగా ఉండేలా టీమ్ సంస్కృతిని నిర్మించాలనుకుంటున్నా. మనం ఆడే మ్యాచ్‌లు, పోటీతత్వం, భిన్నమైన జట్ల వల్ల ఇది కాస్త కష్టమైన పనే అని తెలుసు. అయినా నేను అలా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా. ప్రతి ప్లేయరు సురక్షితంగా ఉండే వాతావరణాన్ని కల్పించాలి. దానివల్ల ప్లేయర్లలో ఉండే శక్తి సామర్థ్యాలు భద్రంగా ఉంటాయని నేను భావిస్తున్నా. ఓ కెప్టెన్‌గా నేను చేయవలసిన ముఖ్యమైన పని కూడా ఇదే' అని గిల్ చెప్పుకొచ్చాడు. టెస్ట్ సిరీస్ లో భాగంగా లీడ్స్‌లోని హెడ్డింగ్లేలో జూన్ 20 న తొలి టెస్ట్ మ్యాచ్ జరగనుంది. సిరీస్‌లోని మిగతా నాలుగు టెస్టులకు ఎడ్జ్‌బాస్టన్, లార్డ్స్, ఓల్డ్ ట్రాఫోర్డ్ ఓవల్ వేదికలు కానున్నాయి. 2021-22 చివరిసారిగా భారత్ ఇంగ్లాండ్ లో పర్యటించింది. ఈ సిరీస్ 2-2 తో సమంగా ముగిసింది. 2024 ప్రారంభంలో ఇంగ్లాండ్, భారత్ చివరిసారిగా టెస్ట్ సిరీస్ ఆడాయి. ఈ సిరీస్ ను భారత్ 4-1 తేడాతో గెలుచుకుంది.

# ఫోటో స్టోరి: ఫెదర్ క్వీన్ ఊర్వశి రౌతేలా



నాక్షి చౌదరి గ్లామరస్ మెటాలిక్ డ్రెస్‌లో అదరగొట్టింది



బాలీవుడ్, టాలీవుడ్‌లో పరిచయం అవసరం లేని పేరు ఊర్వశి రౌతేలా. ఈ పంజాబీ బ్యూటీ ఓవైపు మెయిన్ స్ట్రీమ్ సినిమాలు చేస్తూనే, స్పెషల్ నంబర్లలోను నర్తిస్తోంది. ఇటీవల ఎన్బీకే సరసన -%దబిడి దిబిడి%-% పాటతో మరోసారి దేశవ్యాప్తంగా యూత్ ని ఆకర్షించింది. ప్రముఖ క్రికెటర్ పంథ్‌తో డేటింగ్ గొడవలతోను ఊర్వశి పేరు మార్మోగింది. క్రికెటర్ తో వివాదం తనను బాగా ఫేమస్ అయ్యేలా చేసంది. ఇక తానేం చేసినా తనను తాను సమర్థించుకుంటూ తెలివిగా ముందుకు సాగిపోతోంది ఈ పంజాబీ బ్యూటీ. ఇటీవలే కేన్స్ - 2025 ఉత్సవాల్లోను ప్రత్యక్షమైన ఊర్వశి.. తనను ఫలానా హాలీవుడ్ స్టార్స్ మెచ్చుకున్నారని, క్వీన్ ఆఫ్ కేన్స్ అని పిలిచారని కామెంట్ చేసి దొరికిపోయింది. ఇక ఊర్వశిపై కామెంట్లు చేసేందుకు ఒక సెక్షన్ నెటిజనులు ఎప్పుడూ సిద్ధంగా ఉన్నారు. అందువల్ల నిరంతరం ఊర్వశి ట్రోలింగ్ కి గురవుతోంది. తాజాగా ఈ భామ స్టన్నింగ్ ఫోజ్ ఒకటి ఇంటర్నెట్ ని షేక్ చేస్తోంది. వైట్ అండ్ వైట్ లుక్ లో ఊర్వశి నిజంగా స్టన్నర్ గా కనిపిస్తోంది. ఇది ఊలు, అందమైన ఫెదర్స్ తో ఎంతో భారీతనంతో డిజైన్ చేసిన లెహంగా. దీనికోసం పక్షుల ఫెదర్స్ ని ఉపయోగించుకున్న తీరు ఆకట్టుకుంది. ఊర్వశి ఈ కొత్త డిజైనర్ లుక్ లో చాలా ప్రత్యేకంగా కనిపిస్తోంది. ఈ ఫోటోషూట్ ని షేర్ చేయడమే గాక దీనికి అందమైన క్యాప్షన్ ని ఇచ్చింది. మన ఆత్మలు దేనితో తయారు చేసినా.. అతడి హృదయం %డ% నా హృదయం ఒకటే! అని లవ్ సింబల్ ని షేర్ చేసింది. మొత్తానికి ఊర్వశి నిరంతరం తన ఉనికిని చాటుకునేందుకు చేయని ప్రయత్నం లేదు. ఇప్పుడు వైట్ అండ్ వైట్ ఫెదర్ లెహంగాలో ఎంతో ముగ్ధ మనోహరంగా కనిపిస్తోంది.



ఐశ్వర్య రాజేష్: గ్రేస్‌తో మెరుస్తున్న స్టైల్ ఐకాన్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com